# నేటి నిజం

తెలుగు దినపత్రిక

RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 15-10-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 62 పేజీలు: 8 వెల: రూ.1/-


## 1903 తర్వాత ఇదే తొలిసారి..

## హైదరాబాద్‌లో 191.8 మిమీ వర్షపాతం

హైదరాబాద్, అక్టోబర్ 14: హైదరాబాద్‌లో ఇలాంటి వాన ఎన్నడూ చూడలేదు. మేఘాలు ఊడిపడ్డ తీరు ఈ కాలంలో ఎన్నడూ చోటుచేసుకోలేదు. గత రెండు రోజులుగా కురిసిన వానలకు.. పాత రికార్డులన్నీ బ్రేక్ అయ్యాయి. అక్టోబర్ నెలలో హైదరాబాద్‌లో ఈ రేంజ్‌లో వాన పడడం గత వందేళ్లలో ఇదే మొదటిసారి. 1903లో చివరిసారి ఇలాంటి వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ ఇవాళ చెప్పింది. అయితే ఇవాళ ఉదయం 8.30 నిమిషాలకు హైదరాబాద్‌లో వర్షం నిలిచిపోయింది. ఆ సమయానికి నగరంలో గత 24 గంటల్లో సుమారు 191.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు ఐఎండీ వెల్లడించింది. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో ఇంత భారీ స్థాయి వాన కురవడం 1903 తర్వాత ఇదే తొలిసారి కావడం విశేషం.

ప్రస్తుతం వాయుగుండం తెలంగాణ దాటి కర్నాటకలోని గుల్బర్గా దిశగా వెళ్తోంది. డిప్రెషన్ వేగంగా మహారాష్ట్ర దిశకు పయనిస్తున్నట్లు ఐఎండీ అంచనా వేస్తున్నది. రానున్న 12 గంటల్లో వాయుగుండం మరింత బలహీనపడే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నది. దీని వల్ల మధ్య మహారాష్ట్ర, కొంకన్, గోవా, కర్నాటక, తెలంగాణలో పలు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నట్లు ఐఎండీ డైరక్టర్ మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు. మహారాష్ట్రలో కొండచరియలు విరిగిపడే ఛాన్సు ఉన్నట్లు ఐఎండీ అంచనా వేసింది.

# జలదిగ్బంధనంలో జంట నగరాలు

## కుండపోతతో ఆగమాగం





## మూసీకి డోకా లేదు : మంత్రి జగదీష్ రెడ్డి

హైదరాబాద, అక్టోబర్ 14: మూసీ ఆయకట్టుకు ఎటువంటి పరిస్థితుల్లో కూడా డోకా ఉండబోదని విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ రోజు తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో చరిత్రలో ముందెన్నడూ లేని రీతిలో ఒక్కసారిగా వరద ఉధృతి తీవ్రం కావడంతో.. అప్పటికప్పుడు అదే రాత్రి సూర్యాపేట, నల్గొండ జిల్లా కలెక్టర్ల తోపాటు నీటిపారుదల అధికారులను ఆయన అప్రమత్తం చేశారు.

సూర్యాపేట జిల్లా రత్నపురం వద్ద గండి పెట్టి నీటిని కిందికి వదలాలి అంటూ అధికారులను ఆదేశించారు. అదే సమయంలో సోషల్ మీడియా ద్వారా ఆయకట్టు కింది ప్రజలను జాగ్రత్తగా ఉండాలి అంటూ విజ్ఞప్తి చేసారు. మూసీ ఆయకట్టు మీదకు చేరుకుని అత్యవసర ద్వారాలతో పాటు పూర్తిగా తలుపులు తీయించి 1.75 లక్షల క్యూసెక్కుల నీటిని కిందికి వదలడంతో ఆయకట్టు రైతాంగం ఊపిరి పీల్చుకుంది.

ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. చరిత్రలో ముందెన్నడూ ఊహించని రీతిలో వరద ఉధృతి మూసీకి చేరిందన్నారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులను సమన్వయం చేసుకుని నీటి ప్రవాహాన్ని కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటారని మంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రి వెంట నల్గొండ జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.







## వరద బాధితులను ఆదుకుంటాం : మంత్రి కేటీఆర్ భరోసా

హైదరాబాద్, అక్టోబర్ 14: భారీ వర్షాలకు వరదలో చిక్కుకున్న హబ్సీగూడ, రామంతాపూర్ పరిసర ప్రాంతాల ప్రజలను అన్ని విధాలా ప్రభుత్వం తరఫున ఆదుకు ంటామని మంత్రి కేటీఆర్ భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లో భారీ వర్షాల నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా హబ్సీగూడ, రామంతాపూర్ ప్రాంతాల్లో రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ముంపునకు గురైన ప్రాంతాలను సందర్శించారు. పరిస్థితిని సమీక్షించి, సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. అలాగే సహాయక చర్యల్లో పాల్గొనాలని స్థానిక ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డితో పాటు కార్పొరేటర్‌కు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరూ ఆందోళనకు గురి కావొద్దని, వరద బాధితులను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రుల వెంట పోలీస్, రెవెన్యూ, బల్దియా అధికారులున్నారు.

## రైస్‌బౌల్‌గా తెలంగాణ

### -ధాన్యం కొనుగోళ్లకు పక్కాగా ఏర్పాట్లు: మంత్రి

హైదరాబాద్,అక్టోబర్14(ఆర్‌ఎన్‌ఎ): ప్రతి ఎకరాకూ సాగునీరందించడంతో పాటు, మంచి వర్షాలు కురియడంతో ఈ యేడు పంటలు బాగా పండాయని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. సమైక్య రాష్ట్రంలో ఊరూరా బోర్లు దర్శనమిచ్చేవని, కానీ ఇప్పుడు ఎక్కడికెళ్లినా నీళ్లు కనబడుతున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అపర భగీరథుడిలా అనతికాలంలోనే నీటి పారుదల ప్రాజెక్టులను నిర్మించారన్నారు. ఆయన కృషితో రాష్ట్రం సస్యశ్యామలంగా మారుతున్నదన్నారు. తెలంగాణను రైస్‌బౌల్‌గా మార్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందన్నారు. పంటలు చేతికి రాగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం చేస్తామని, రైతులు దళారులను ఆశ్రయించకుండా ఉండే పరిస్థితులు ఉటాయని అన్నారు. అంతేకాకుండా ధాన్యం ధరలు కూడా పడిపోకుండా ఉండే అవకాశం ఉంది. దళారులు, వ్యాపారులు ధాన్యం ధరల విషయంలో రైతులను ఇబ్బంది పెట్టకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

తక్షణవే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశించామని అన్నారు. జిల్లాల్లో ఖరీఫ్ వరి ధాన్యం మార్కెట్‌ను ముంచెత్తనుంది. ఈ వానాకాలంలో వరి విస్తీర్ణం బాగా పెరుగడంతో అధికారులు కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు. ప్రతీ గ్రామంలో ఒక కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. కొనుగోలుకు కావాల్సిన గన్నీ బ్యాగులతో పాటు ఇతర ఏర్పాట్లు చేస్తున్నారు. నియంత్రిత సాగులో భాగంగా సన్న ర కాలను ఎక్కువగా వేశారు. గత ఏడాదికి మించి ఈ సారి సన్నరకాలను వేశారు. ఈ వానాకాలంలో వరి విస్తీర్ణం పెర డం వల్ల దిగుబడి బాగా వస్తోందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత వరి విస్తీర్ణంను బట్టి తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులు దాటి వస్తోందని అంచనా వేస్తున్నారు.

## కూచిపూడి మహారాణి పద్మశ్రీ డాక్టర్ కట్టా శోభానాయుడు మృతి

కూచిపూడి మహారాణి పద్మశ్రీ డాక్టర్ కట్టా శోభానాయుడు ఇక లేరు. న్యూరోలజి సమస్య తో స్టార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి 1.44 నిముషాలకు కనుమూశారు. ఒక అద్భుతమైన నాట్య రారాణిని కూచిపూడి నాట్య రంగం కోల్పోయింది. దేశ విదేశాల్లో రెండు వేల మంది విద్యార్థులను కూచిపూడి నాట్య తారలుగా తీర్చి దిద్దిన ఘనత శోభా నాయుడుదే . 100 కు పైగా సోలో కొరియోగ్రఫీల సృష్టికర్త. పాతిక కూచిపూడి నృత్య రూపకాల సృజనశీలి . పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ పురస్కారం, నృత్య చూడామణి, ప్రతిష్టాత్మక



ఎన్టీఆర్ పురస్కారం తో పాటు వందలాది పురస్కారాలు ఆమెను వరించాయి. ఏ పాత్రలోనైనా ఒదిగి ఆ పాత్రకు వన్నె తెచ్చే ప్రత్యేకత, వేదిక పై దునుమాడే శక్తి వున్న ఏకైక శాస్త్రీయ సాంప్రదాయ నర్తకీమణి శోభానాయుడు . హైదరాబాద్ దోమలగూడా లో ఎన్నో ఏళ్లుగా కూచిపూడి ఆర్ట్ అకాడమీ స్థాపించి సేవలు అందిస్తున్న మహనీయురాలు శోభానాయుడు ను కరోనా బలి తీసుకోవడం విచారకరం దురదృష్టకరం. ఆమె భర్త శ్రీ అర్జునరావు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లో చీఫ్ సెక్రటరీ గా పని చేశారు. కూచిపూడి మహా దిగ్గజం దివంగత వెంపటి చిన సత్యం ప్రియ శిష్యురాలు శోభానాయుడు ప్రపంచ వ్యాప్తంగా వేలాది ప్రదర్శనలు ఇచ్చి కూచిపూడి నాట్యానికి ఔనత్యాన్ని తెచ్చారు. కూచిపూడి నాట్యం కోసమే జన్మించిన కారణ జన్మురాలు. ఇంకా ఎన్నో నాట్య ప్రయోగాలు చేయాలనీ చివరి శ్వాస వరకు తపిస్తూనే వున్నారు. ఇంత అకస్మాత్తుగా ఆమె వెళ్లిపోవడం ద్రిగ్భాంతి ని కలిగిస్తోంది.



## జమ్ములో ఎన్‌కౌంటర్ ఇద్దరు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్ముకశ్మీర్ షోపియన్ జిల్లాలో బుధవారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. పక్కా సమాచారం మేరకు షాపియాన్ జిల్లాలోని చకురా ప్రాంతంలో భద్రతా దళాలు ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. భద్రతా బలగాలను చూసిన ఉగ్రవాదులు తప్పించుకునేందుకు కాల్పులు జరిపారు. దాంతో భద్రతా దళాలు ఎదురుకాల్పులు జరిపాయి. తుపాకీ కాల్పులు ముగిసిన తర్వాత అక్కడ వెతగ్గా.. ఇద్దరు ఉగ్రవాదుల మృతదేహాలు లభించాయి. ఈ ప్రాంతంలో మరింత శోధిస్తున్నట్లు జమ్ముకశ్మీర్ పోలీసులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో జమ్మూ కాశ్మీర్ పోలీసులు, భద్రతా దళాల సంయుక్త బృందం పాల్గొన్నది. ఎన్‌కౌంటర్‌లో హతమైన వారి మృతదేహాలను ఇంకా ఎవరూ స్వాధీనం చేసుకోలేదు. చనిపోయిన ఉగ్రవాదులు ఏ గ్రూపునకు చెందినవారో గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు.



## ఎల్లప్పుడూ మీతోనే ఉంటాం : సీపీ అంజనీ కుమార్

హైదరాబాద్,అక్టోబర్14: తామెల్లప్పుడు ప్రజలకు అందుబాటులోనే ఉంటామని హైదరాబాద్ నగర సీపీ అంజనీ కుమార్ అన్నారు. నగరాన్ని చుట్టుముట్టిన భారీ వర్ష పరిస్థితులపై సీపీ ట్విట్టర్ ద్వారా స్పందించారు. సమాజం కొరకు తామంతా సామూహికంగా కదిలి ఐక్యతతో పనిచేయనున్నట్లు చెప్పారు. ముందున్న లక్ష్యం ఎంత కష్టసాధ్యమైనదైనా కానివ్వండి. సవాళ్లు ఎదురౌతూనే ఉంటాయి కానీ మనమెప్పుడూ ధైర్యాన్ని కోల్పోవద్దన్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో పేదల గురించే తమ ఆందోళనంతా అన్నారు. పరిస్థితుల మెరుగుకు అవకాశాలు ఉన్నాయి. ఆ దిశగా పనిచేస్తామని సీపీ పేర్కొన్నారు.

## పునరావాస కేంద్రాలకు ముంపు బాధితులు.. ఆహారం అందజేత

హైదరాబాద్ , అక్టోబర్ 14: తీవ్ర వాయుగుండం ప్రభావంతో హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసింది. దీంతో నగరంలో జన జీవనం స్తంభించింది. పలు ప్రాంతాలో వరదలో చిక్కుకుపోయాయి. దీంతో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. వర్షాల కారణంగా ముంపునకు గురైన ఆయా ప్రాంతాల ప్రజలను అధికారులు సమీపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ సందర్భంగా వారికి ఆహారం అందిస్తున్నారు. అలాగే పలు చోట్ల ప్రభుత్వం సహాయ శిబిరాలను ఏర్పాటు చేసింది. ఇందులో వారికి ఆహారంతో పాటు అవసరమైన వైద్య సదుపాయం కల్పిస్తున్నారు. అలాగే ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ, డీజీపీ మహేందర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వరద పరిస్థితిని సమీక్షించారు. సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ముంపు బాధితులతో మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున అదుకుంటామని, ఆందోళనపడొద్దని సూచించారు.

## గిరిజన ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్, అక్టోబర్ 14: వరుసగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గిరిజన, ఐటీడీఏ ప్రాంతాల్లోని అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఆదేశించారు. వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగుతున్నాయని నీట మునిగిన లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆయా ప్రాంతాల కలెక్టర్లు, ఐటీడీఏ అధికారులతో ఫోన్లో మాట్లాడి పలు సూచనలు చేశారు. మరో రెండు రోజుల పాటు వర్షం వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, గిరిజన ప్రాంతాల కలెక్టర్లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ప్రజలందరికీ కంట్రోల్ రూమ్ నెంబర్ చేరేలా ప్రచారం చేయాలని సూచించారు. వరదల్లో, వాగుల్లో ప్రజలు ప్రమాదంలో పడకుండా తగిన హెచ్చరికలు చేయాలని, ఏదైనా అత్యవసరం ఏర్పడితే తాను 24 గంటలు అందుబాటులో ఉంటానని వెంటనే సమాచారం అందించాలన్నారు.

## వారి జీవితాన్ని ముగించే హక్కు మీకెవరిచ్చారు..?



-డా|| కత్తి పద్మారావు

సెల్:9849741695

ఆకాశం మేఘామృతం అయివుంది
నక్షత్రాలు తమ సొంత గూటికి చేరాయి
ఏదో సజీవ చిత్రాన్ని కాల్చిన వాసన
భారతదేశాన్ని కమ్ముకొంది
ఆ నుసి పాలకుని కళ్ళకు కమ్మింది
ప్రతి మరణంలో ఓ రణం వుంది సుమా!
వారి జీవితాన్ని ముగించే హక్కు మీకెవరిచ్చారు?
అనే ప్రశ్న విస్తరిస్తుంది
రాజ్యాల పునాదులు కదులుతున్నాయి
ఇటుక ఒక్కొక్కటి బెసుకుతుంది
అవి ఆశ్రమాలు కాదు యోగులు పాలించడానికి
ప్రజలను పాలించాలంటే రాజనీతి ఉండాల్సి వుంది
ఏదో చిత్రం మసక మసకగా కనిపిస్తుంది
అది చీకటి వెలుగులతో చేసిన శిల్పం
బొమ్మ సజీవమైంది
అనంత వెలుగులు దాని గుండెల్లో నిండివున్నాయి
కడలి అలల సడి ఆ కనుల్లో వినిపిస్తుంది
జడివానలు కూడా ఆమె పిడికిలిలో ఒదిగి వున్నాయి
ఆ ఇంటి ముందు నిలబడ్డ దీపస్తంభం
ఏదో కథ చెబుతోంది
ఆ పద్నాలుగు అంతస్థుల మేడలో
ఒక్క లైటూ ఆరిపోవడం లేదు
ఆ గదుల్లో బంగారు రేకులతో చేసిన
బాత్‌రూమ్‌లు కట్టారు
ఆమె ఇంటి మీద విమానాలు దిగుతున్నాయి
భర్త ఆకాశ హర్మ్యాల్లో విహరిస్తున్నాడు
అయినా! ఆమె ముఖంలో కాంతి లేదు
రూపాయి కాగితాలు వెలుగు తేలేవు కదా!
ఈ కన్యలు అర్ధనగ్నంగా ఊరేగడానికి
గోవాదాకా వెళుతున్నారు
అశ్లీలత వీరికి ఆభరణమవుతుంది కదా!
కడలికి వున్న గాంభీర్యం వీరిలో లేదు కదా!
వీరందరికీ బొమ్మలుగా జీవించడమే ఇష్టం
మనుషులుగా జీవించడం రావడం లేదు
మనిషిగా జీవించడం అంటే దయా గుణం కావాలి
సేవాగుణంలో మదర్ థెరిస్సా
ప్రపంచానికి ఆదర్శం కాలేదా!
ఆమె రూపానికి నోబుల్ బహుమతి రాలేదు
ఆమె సేవకు, కరుణకు శాంతి బహుమతి వచ్చింది
ఎందుకు వీరు?
రాజ్యాంగేతర శక్తులవుతున్నారు
ముసుగు దొంగలుగా జీవిస్తున్నారు
తమకు తామే విధ్వంసం చేసుకొంటున్నారు
వస్తువులకు, వీరికి తేడా లేదు కదా!
ఆ మందార పువ్వు చూడు ఎంత వికసించిందో!
దాని ఎర్రని రంగు మనస్సును ఉత్తేజపరుస్తుంది
ఆ పువ్వును కోస్తున్న చేతులు సుకుమారంగా వున్నాయి
అవును!
వీరి ముఖాలు రంగులు లేక విలవిలలాడుతున్నాయి
బుర్రల్లో జ్ఞానం లేక చూపుల్లో తీక్షణత తగ్గింది
ఈ పాలకులు పుస్తక ద్వేషులు
వీరు గ్రంథాలయానికి వెళ్ళి ఎరుగరు
వ్యాపార నిపుణులు మాత్రమే!
మనుషులను రూపాయలతో కొందామని చూస్తున్నారు
జ్ఞానదీపాలు వెలిగించలేకపోతున్నారు
నిజమే! కరోనా ఎందరినో తీసుకువెళుతూ వుంది
కొన్ని నక్షత్రాలు రాలిపోతున్నాయి
కొన్ని బ్యాంకులు విలీనమవుతున్నాయి
కొందరు సామంతులు చేతులు ఎత్తి నిలబడుతున్నారు
వ్యవసాయం కార్పొరేట్ చేతుల్లోకి పోతుంది
పాలకులు తాబేదారులు అవుతున్నారు
కులం గొడ్డళ్ళకు పదును పెడుతున్నారు
ఈర్ష కళ్ళలో ఉరుముతుంది
అందుకే! విజ్ఞాన భారతాన్ని ఆవిష్కరింపచేయాలి
అక్షరవిద్య మాత్రమే జ్ఞాన ప్రవంతిని పొంగించదు
నైతికశక్తి, జ్ఞానబోధన దేశానికి ఊపిరులు
మహాత్మాఫూలే బోధనలు మనకు శక్తులు
భారతదేశ పునర్నిర్మాణమే మన కర్తవ్యం



# బాల వికాసం

# బాలవర్ధన్

ఈ తరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల

( ప్రసిద్ధ జానపద కథ బాలనాగమ్మ కథ స్ఫూర్తితో ఆధునిక సృజన)

7

ఆదిలాబాద్. ఇది తెలంగాణాలో ఉత్తర దిశలో ఉన్న చివరి జిల్లా. మహారాష్ట్ర సరిహద్దుగా ఉన్న జిల్లా. శాతవాహనులు మొదలు గోలకొండ సుల్తానుల వరకు చరిత్రవున్న ప్రాంతం. బీజాపూర్ సుల్తాను ఆదిల్ షా పేరు మీద దీన్ని ఆదిలాబాద్‌గా మార్చారని, అంతకు ముందు దీన్ని ఎదులా పురం అని పిలిచేవారని కథనాలు ఉన్నాయి.

సహ్యాద్రి, సత్మాలా, కెరిమెరి కొండలూ, గుట్టలూ, అడవులతో అధికప్రాంతం ఆవరించి ఉండే ప్రాంతం ఇది. గోదావరి, ప్రాణహిత, పెన్‌గంగ, వార్ధా నదుల పరీవాహక ప్రాంతం. గోండులు, ప్రధానులు అనే గిరిజనులు ఎక్కువగా నివసించే ప్రాంతం. నాగజాతి సర్పాలను పూజించే కేస్లాపూర్ నాగోబా జాతర జరిగే చోటు. సుమారు వెయ్యేళ్ళ కిందట గోండు రాజులు నిర్మించిన గాంధారి కోట ఉన్న ప్రాంతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా. శకుంతలా దుశ్యంతులు విహరించిన ప్రాంతమని, ఆ శకుంతల పేరుమీదనే కుంతాల జలపాతం ఏర్పడిందని జనం చెప్పుకునే కథలు ఇక్కడ ప్రచారంలో ఉన్నాయి. కొమురం బీమ్, రాంజీ గోండు వంటి పోరాట వీరుల పురిటిగడ్డ ఇది. వనులు, గనులు విస్తారంగా ఉన్న జిల్లా.

ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన విషయాలు గూగుల్‌లో చదివాడు బాలవర్ధన్. తనకు అనుమానం వచ్చిన చోట తాతను అడిగి తన సందేహాలు తీర్చుకున్నాడు. రాత్రి సుమారు పదకొండు గంటలకు వాళ్ళు ఆదిలాబాద్‌లో తమ ఇంటికి చేరుకున్నారు. పదిహేనేళ్ళ కిందట ఈ ఇల్లు ఊరికి చివర ఉన్నట్టుండేదని, ఇప్పుడు చుట్టూ అనేక ఇళ్ళూ, కాలనీలూ, బిల్డింగ్‌లూ నిర్మించడంవల్ల ఊరి లోపలికి వచ్చేసినట్టు అయిందని కులకర్ణి చెప్పాడు. కన్యాకుమారి నుంచి కాశీ వరకు వెళ్ళే జాతీయ రహదారి ఆదిలాబాద్ నుంచి వెళుతుంది. ఆ మార్గంలోంచి ఆదిలాబాద్ పట్టణంలో ప్రవేశించిన తరువాత, ఉత్తరపు చివరలో ఈశాన్యం వైపు మరో మార్గంలో ఓ అరకిలోమీటరు దూరంలో ఉందా ఇల్లు.

ప్రసిద్ధ బాలల రచయిత
డా॥ వి.ఆర్.శర్మ కలం నుండి
జాలువారిన
ఈతరం టీనేజ్ పిల్లల ఆధునిక
కాల్పనిక నవల 'బాలవర్ధన్'.
ప్రతివారం 'నేటినిజం'
పాఠకుల కోసం ప్రత్యేకం...

తాను ఆ ఇంట్లోనే పుట్టినా బాలవర్ధన్‌కు అక్కడికి రావడం ఇదే మొదటి సారి. ఎప్పుడూ తాతా అమ్మమ్మలే తమ ఇంటికి వచ్చేవాళ్ళు. తనను ఎప్పుడూ ఇక్కడికి తీసుకొని రాలేదు. ఆ కారణం గురించి తాను ఎప్పుడూ ఆలోచంచలేదు. ఏదైనా సందర్భం వస్తే తన తల్లిదండ్రులే ఇక్కడికి వచ్చి వెళ్ళేవాళ్ళు. అందుకు కారణం ఏమిటో ఇప్పుడు అర్థమౌతున్నది. ఆ ఇల్లును చూడగానే తన తల్లిని గురించిన సంగతులన్నీ దృశ్యాలు, దృశ్యాలుగా కళ్ళముందు రూపు కడుతున్నాయ్. నాగరత్నమ్మ చెప్పిన విషయాలన్నీ తాను స్వయంగా చూసినట్టే అనిపిస్తున్నాయి. ఈగేటు దగ్గరినుంచే కదా అమ్మ కనిపించకుండా మాయమైంది!

లోపలికి వెళ్తూనే అమ్మమ్మ శ్రీదత్త ప్రేమగా పలుకరిస్తూ దగ్గరికి తీసుకుని ముద్దుపెట్టుకుంది. ఆమెతో మాట్లాడుతుంటే బాలవర్ధన్ కళ్ళు ఆ ఇల్లంతా కలయ తిరిగాయ్. అతని తల్లి బాల్యం, ఆమె జీవితం అణువణువు నిండిన కోవెల అది. అమ్మమ్మతో మాట్లాడుతూనే ఆమెను వెంటబెట్టుకొని ఇల్లంతా తిరిగి చూశాడు. అంతటా తన అమ్మను




వెతుక్కున్నాడు.

ఈలోగా కులకర్ణి స్నానం చేసి వచ్చాడు. "ముందు తిందాం! ఈరోజు మీరు వస్తున్నారని మీ అమ్మమ్మ ఏవో స్పెషల్ వంటలే చేసి ఉంటుంది. మనం పొద్దట్నుంచి అన్నంతినలేదు కదా. ఆకలి దంచేస్తోంది" అంటూ భార్యవైపు చూశాడు.

"వెళ్ళి, కాళ్ళు చేతులు కడుక్కుని రండి . వంకాయ సోగి, పుంటికూర తొక్కు, టమాట పప్పు చేశాను. గుమ్మడికాయ వడియాలు, అప్పడాలు వేయించాను" చెప్పింది శ్రీదత్త. ఆమె ఓ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నది.

వాళ్ళు మాట్లాడుకుంటూనే భోజనాలు పూర్తి చేశారు. ప్రతి పదార్థంలో అమ్మమ్మ ప్రేమను ఆస్వాదించాడు బాలవర్ధన్. అడవిలో దొరికిన ఇద్దరు ఆడపిల్లలను తెచ్చి తనపిల్లల్లా పెంచడానికి, తమకు పిల్లలే వద్దనుకున్న గొప్ప మానవత్వం ఉన్న ఆ దంపతులను చూస్తుంటే బాలవర్ధన్ హృదయం గౌరవంతో, ప్రేమాభిమానాలతో నిండిపోయింది.

భోజనాల తరువాత కూడా వాళ్ళు రాత్రి ఒంటిగంట వరకు కబుర్లతోనే గడిపారు. తమ పిల్లలు నాగరత్న నాగమణి చిన్ననాటి చదువులు, అల్లరి పనులు, ఆటపాటలు, ఇష్టాయిష్టాలు, పెళ్ళి సంగతులు చోటు చేసుకున్నాయి. చివరికి నాగమణి కనిపించకుండా పోయినప్పటి విషయం వచ్చేసరికి ఓ విషాద మేఘం కమ్ముకున్నట్టు అనిపించింది. ఆ విషయం చెప్తున్నప్పుడు ప్రత్యక్షసాక్షి అయిన రాముకు దు:ఖం ఆగక బోరున ఏడ్చేశాడు. "నా అజాగ్రత్త వల్లనే ఈ అనర్థం జరిగింది" అంటూ తల బాదుకున్నాడు. అందరికీ పాత గాయాలను కెలికినట్టు అయింది. కలత నిద్రతోనే ఆరాత్రి గడిచిపోయింది.

(సశేషం..)



–డా॥వి.ఆర్.శర్మ
సెల్:9177887749

## చెట్టు

మనిషి కొక్క మొక్కనైన
నాటుదాము బాలకా!
ప్రాణ వాయువును పంచును
పచ్చనైన మొక్కలు!!

తరువులున్న తరిగిపోవు
కలుషితమ్ము బాలికా!!
భువికి సారమెంతొనిచ్చు
వృక్షమెపుడు బాలకా!! !!మనిషి!!

పచ్చనైన చెట్లతోని
ప్రకృతెంతొ అందము!!
పచ్చదనము చూసి మనసు
పులకరించు బాలకా!!

రంగు రంగు పూలతోని
రమ్యముగను తరువులు!!
చూడముచ్చటెంతొ గొలుపు
చూపరులకు బాలకా!! !!మనిషి!!

చెట్లు మనకు నీడనిచ్చు,
పూలనిచ్చు,ఫలములిచ్చు
చచ్చి కూడ తనువునిచ్చు
త్యాగానికి గుర్తులు!!
మొక్క నాటి నీరుపోయు
మరువ బోకు బాలకా!! !!మనిషి!!

–అన్నాడి జ్యోతి
సిద్దిపేట.

## కన్నీరు బతుకమ్మ

అమ్మా, బతుకమ్మా
ఈ సంవత్సరం మాకు
మిగిలింది కన్నీరమ్మా
బతుకమ్మ ను పేర్చాలని
సంతోషంగా ఆడాలని
ఆతృత ఉండేది అప్పుడు
కానీ ఎందుకో
భయంగా ఉంది ఇప్పుడు

ఆడవాళ్ళు కు నీవే
ఒక ఆరాధ్య దైవమమ్మా
తెలంగాణ రాష్ట్రానికి
ప్రత్యేక రూపమమ్మా
ఆ రూపాన్ని నీవే
కాపాడాలమ్మ
మా ప్రాణలను కాపాడు
మా మంచి బతుకమ్మా



–కయ్యాల అక్షయ
9వ, తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జక్కాపూర్
సిద్దిపేట జిల్లా, తెలంగాణ సెల్:9398995856

## బతుకమ్మ

ప్రకృతి పండుగ
ప్రపంచంలో పూలనే
పూజించే ఒకే పండుగ
తెలంగాణ సంస్కృతిని
ప్రతిభింబించే పండుగ
తొమ్మిది రోజులు రోజుకో
పేరుతో వసొంతోత్సవాలు
సౌరభాలు గా ఆరోగ్యాన్ని
కులమతాలకు అతీతంగా
ఆడపడుచులు ఆత్మీయత
జీవిత సత్యాలు వారి నోటి
వెంట జనపాదాలు అయ్యి
లయబద్ధంగా సాగె
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ
ఆరోగ్యాన్ని
తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే
ఐక్యపండుగా



ఆనందాల పర్వశాన్ని
బొడ్డెమ్మల తో మురిపంగా
మొదలు అయ్యి సద్దుల బతుకమ్మలతో ముగిసే
ఈ పండుగ సముద్రం అంత సారం ఉంది



–వి.శేషారావు
9440408080

నిజం, వాస్తవం,సత్యం...
ఈ మూడూ ఒకటి కాదు.
నిజం, వాస్తవాలు...దాదాపుగా
ముందుగా కుదుర్చుకున్న ఒప్పందాలు.
అందుచేత వాటిని మాటలతో,
సంకేతాలతో చెప్పవచ్చు.
సూచికలతో ప్రదర్శనకూ ఉంచవచ్చు.
కాని, సత్యాన్ని మాటలతో
ఎంత వివరించినా అది ఎప్పటికీ
సత్యం కానే కాదు.
'సత్యం' అనే మాటా సత్యం కాదు.

-మునిమడుగుల రాజారావు.

## మత్తడి

చినుకులన్ని కలిసినయి
వరదలై సాగినయి
కుంటలు చెరువులు నిండినయి
మత్తడులు దుంకినయి
చేపలన్ని ఎగిరినయి
కప్పలన్ని దుంకినయి
కొంగలు జపం చేసినయి
బుడగలు మునిగి తిరిగినయి
ఎండ్రి కాయలు దాగినయి
నీటి పాములు ఉరికినయి
పిల్లలు పెద్దలు నీళ్ళతో ఆడినరు
మత్తడిలో ఈత కొట్టి మురిసినరు
ఆటపాటలతో కనువిందు చేసినరు



–ఉండ్రాళ్ళ రాజేశం
9966946084

## బాల గేయం
## బతుకమ్మ

తలిరుటాకుల మీద భద్రంగా
తంగేడు పువు చేర్చి అందంగా
గునుక పూలను పేర్చి గుండ్రంగా
గుమ్మడి పూవు నుంచి గౌరమ్మగా
గుర్తుగా భావించి పూజించగా
ఆశ్వీజ మాసాన స్త్రీలంతా
ఆడేరు బతుకమ్మ ఊరంతా
బాలబాలికలకు కేరింతా!..

రోజుకో రూపాన నవదుర్గా
పూజల్ని పొందేను పావనంగా
దుర్గాష్టమీనాడు మహిష మర్దనిగా
దురితాల నణచేను ఉత్సవంగా!
వాయినాలిచ్చుకొని వనితలంతా
హాయిగా గడిపేరు వైభవంగా!
తెలంగాణ గుర్తుగా బతుకమ్మా
ప్రపంచాన నిలిచింది తేజంగా.



– డా॥ వద్దేపల్లి కృష్ణ
9246541699

## పల్లె..పట్నం

పాడి పంటలతో విలజిల్లును పల్లెలు
కార్మాగారాలతొ కలకలలాడును పట్నాలు
స్వచ్ఛమైన గాలికి కన్నతల్లి పల్లెలు
కాలుష్య ఖనిజాలు పట్నాలు
నాగరికతకు ఆయువు పట్టు పల్లెలు
నవీన నాగరికతకునిలయాలు పట్నాలు
ఆత్మీయతకు ఆలంబన పల్లెలు
ఒంటరి బ్రతుకుల మెతుకులు పట్నాలు
పొలం పనులకు బలం పల్లెలు
ఉద్యోగుల క్షేత్రాలు పట్నాలు
నిశ్శబ్దాని నిలువెత్తు నిదర్శనం పల్లెలు
రణగుణ ధ్వనులకు నిదర్శనం పట్నాలు
రైతులే రారాజులు పల్లెలందు
నాయకులే రారాజులు పట్నమందు
పూరిగుడిసెలు పెంకటింట్లు పల్లె ఆస్తులు
మేడలు మిద్దెలు పట్నం ఆస్తులు
ఎడ్లబండి ప్రయాణం పల్లెటూరు వాహనం
బస్సు ఆటో రైలు ప్రయాణం పట్నం వాహనం



–జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315





# అంబరాన్నంటే సంబరాన – "బతుకమ్మ" మమ్ము దీవించగా రావమ్మా

### హైందవ సంస్కృతి సంప్రదాయాల పూర్వపరాలు :

**యత్రనార్యస్తు పూజ్యంతే**
**రమంతే తత్ర దేవతా ...**

ఎక్కడ మహిళలు పూజింపబడతారో, అక్కడ దేవతలు ఉంటారన్నది నానుడి.

ఈ నానుడి చుట్టూ పరిభ్రమిస్తూ, కొనసాగుతున్న హైందవ సంస్కృతి, ఇప్పటికీ సజీవంగా నిలిచి, జీవనదిగా ప్రవహిస్తుందంటే దానికి ముఖ్యకారణం మన పండుగల వైశిష్ట్యం అని చెప్పక తప్పదు.

### తెలంగాణ ప్రాంతం పువ్వులతో విరాజిల్లే ప్రత్యేక పండుగ :

మానవుని జీవన గమనంలో శుభారంభానికి, విజయానికి, శౌర్యానికి పండుగలను ఉత్సాహభరిత వాతావరణంలో జరుపుకోవడం ఆనవాయితీ. అందులో హిందూ మతములో అనేకానేక సంస్కృతి, సంప్రదాయాల సమాహారంగా పండుగలకు భూమాత, ప్రకృతిమాత కూడా సహకరించే విధముగా ఉంటుంది. బతుకమ్మ పండుగ వచ్చిందంటే, తెలంగాణ ప్రాంతం అంతా పండుగ కోలాహలం కనిపిస్తూ ఉంటుంది. చిన్నా, పెద్దా, పండు ముసలి వారు సైతం హడావిడి పడుతూ సందడి చేస్తూ కనపడుతుంటారు. ఆశ్వీయుజ మాసములో వచ్చే దసరా పండుగకూ ఎంత ప్రాధాన్యం ఉందో, బతుకమ్మ పండుగకు కూడా అంతే ప్రాధాన్యం ఉంది. అయితే బతుకమ్మ పండుగ మాత్రం మహిళలకు సంబంధించిన పండుగ. వర్షాకాలం ముగుస్తూ, శీతాకాలం ప్రవేశిస్తున్న సమయంలో తెలంగాణలోని వాతావరణం మొత్తం పచ్చగా వుంటుంది. ప్రకృతి మాత ఆకుపచ్చ చీర కట్టుకున్నట్టుగా, చెరువులన్నీ తాజా నీటితో నిండి ఉంటాయి. అనేక రకాలైన పూలు, రకరకాల రంగుల్లో విరబూసి ఆకట్టుకుంటాయి. వీటిలో గునుక, తంగేడి పూలు ప్రథమ స్థానంలో నిలుస్తాయి. అడవుల్లో, చేలల్లో ప్రకృతి నయనానందకరంగా ఉంటుంది. పొట్టకొచ్చిన వరి పొలాలు, మొక్కజొన్న పంట కూడా కోతకు సిద్ధమై ఉంటుంది. అలాగే సీతాఫలాలు కూడా విరగకాస్తాయి ప్రకృతి రమణీయతతోపాటు రైతులకు కూడా సంతృప్తికరంగా ఉండే వాతావరణం. ఈ ప్రాంతంలోని పండించని బంజరు మైదానాలలో అడవి పువ్వులు వివిధ శక్తివంతమైన రంగులలో వికసించే సమయం కూడా. వీటిలో చాలా సమృద్ధిగా గుణుక, తంగేడు, బంతి, చెమంతి, నంది-వర్దనం పువ్వులన్ని కూడ పుష్పించి ప్రకృతికి కూడా శోభ నిచ్చేవిధంగా ఉంటుంది. తెలంగాణ సంస్కృతికి చిహ్నంగా బతుకమ్మ పండుగ ఎంతో ముఖ్యమైనది. ఈ పండుగకు గ్రామాలలో తెలంగాణ జానపద స్త్రీలు ఆచార సంప్రదాయాలతో, ఆనందోత్సహాలతో వెల్లి విరిసే రంగు రంగుల పువ్వుల పండుగను ఎంతో భక్తి శ్రద్దలతో జరుపుకుంటారు. సౌభాగ్యప్రదాయినీ అయిన గౌరీదేవియే బతుకమ్మగా ఆరాధిస్తారు. ఎంతో సామజిక ప్రాధాన్యం, శాస్త్రీయ దృక్పథం ఇమిడి ఉన్నట్లుగా ప్రతీతి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా అక్కడక్కడ జరుపుకుంటారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బతుకమ్మ పండుగను రాష్ట్రపండుగగా, ఏడాది కేడాది జరుపుకుంటున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఎంపికచేసిన స్త్రీలకు బతుకమ్మ చీరలు పంపిణి కార్యక్రమం చేపట్టింది. ఇకపోతే ఈ ఏడాది అన్ని పండుగలకు (కరోనా కోవిద్ 19 ) ఆటంకం కలిగించినట్లుగా ఉన్నప్పటికీ, భౌతిక దూరం పాటిస్తూ, కేంద్ర రాష్ట్రప్రభుత్వం సూచించిన జాగ్రత్తలు తీసుకుంటూ బతుకమ్మ పండుగ జరుపుకోవడానికీ సిద్దపడుతున్నట్టు బోగట్టా. ఎంతో ప్రతిష్టాత్మకంగా దేశవిదేశాల్లో ఉన్నవారు సైతం, బతుకమ్మ పండుగ సంబరాలు జరుపుకుంటూ ఈ పండుగకు ఎనలేని గుర్తింపు తీసుకురావడం విశేషం.

### బతుకమ్మ పండుగ ప్రాశస్త్యం :

బతుకమ్మ పండుగ తెలంగాణా రాష్ట్రములోని ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. ఈ బతుకమ్మ (గౌరి) పండుగ లేదా సద్దుల పండుగ. దసరాకి రెండు రోజుల ముందు వస్తుంది. బతుకమ్మ పండుగ వెనుక అనేక కథలు ఉన్నప్పటికీ, వాటిలో ముఖ్యంగా పేర్కొనే కథ ఇది. ఒక బాలిక భూస్వాముల అకృత్యాలను భరించలేక ఆత్మహత్య చేసుకుందనీ, చిన్న వయస్సులో ఏ కోరికలు తీరక ముందు గతించిన ఆ బాలికను బతుకమ్మగా కీర్తిస్తూ, అప్పటినుంచి గౌరమ్మ గా పూజిస్తూ ఉండటాన స్త్రీలకు సంబంధించిన పండుగగా 'బతుకమ్మ' ప్రాచుర్యం పొందింది. 'బతుకమ్మ' వేడుక సందర్భంగా స్త్రీలందరూ తమకు, భర్తకు, పిల్లలకు ఎలాంటి ఆపద రాకూడదని గౌరమ్మని వేడుకుంటారు. అలాగే బతుకమ్మ పండుగకి సంబంధించి మరోకథ కూడా ప్రచారంలో ఉంది. దక్షిణ భారత దేశాన్ని పాలించిన చోళ వంశ చక్రవర్తి ధర్మాంగదుడు, సంతానం కోసం పూజలు చేయగా ఆయన భార్య లక్ష్మీదేవి అనుగ్రహముతో ఒక కూతుర్ని కన్నది. ఆమెకు లక్ష్మి అనే పేరు పెట్టారు. పసిబిడ్డ అయిన లక్ష్మి అనేక గండములను ఎదుర్కొంది. అప్పుడు తల్లితండ్రులు ఆమెకి "బతుకమ్మ" అని పేరు పెట్టారు. శుచి శుభ్రతే "శ్రీ మహాలక్ష్మి" కి అసలు సిసలు పూజగా శ్రీమహాలక్ష్మిని ఆరాధించడం మొదలైనట్లుగాను, శ్రీమహాలక్ష్మీని 12 సత్ గుణములు ప్రసాదించమని కోరుతూ రూపం, శీలం, సత్యం, నిజాయితీ, ధర్మం, మాధుర్యం, బాహ్యాంతర శుద్ధి, సహనం, రతి, పాతివ్రత్యం స్త్రీకి మహా సంపదలు, ఈ పన్నెండు గుణాలు గల స్త్రీ లభించడం ద్వారా పురుషునికి మహా సంపద, అంతకు మించిన సంపద భూమిపై లేదంటారు పెద్దలు. పెండ్లి కాబోయే పురుషునికి నచ్చే విధముగా వరాలివ్వమని కోరుతుంటారనీ ప్రతీతి. బతుకమ్మ పండుగలో పెళ్లికాని యువతులు గౌరమ్మని మంచి భర్తను ప్రసాదించాలనీ పెళ్లి అయిన స్త్రీలు తమ పసుపు కుంకుమలు చల్లగా కాపాడమని, సంతానాన్ని ఇవ్వమని కోరుతూ తల్లి బతుకమ్మ, పిల్ల బతుకమ్మలను అలంకరించి తల్లి పక్కనే పిల్ల ఉంటేనే స్త్రీ మాతృ హృదయం విధితమవుతుందన్న ఆనవాయితీ. సంతానం వల్లనే స్త్రీ జీవితం సార్ధకం అవుతుందని భావిస్తారు. ఇలాంటి వాతావరణంలో తెలంగాణ ఆడపడుచులు "బతుకమ్మ" ప్రకృతి సౌందర్యాన్ని అద్భుతమయిన రంగురంగుల పువ్వులతో కీరిస్తూ బతుకమ్మ పండుగను వైభవంగా జరుపుకుంటారు.

### తొమ్మిది రోజుల బతుకమ్మ నైవేద్యాలు :

9 రోజులపాటు ప్రతిరోజూ ఒక్కొక్క రకమైన నైవేద్యం సమర్పిస్తారు. మొదటి ఎనిమిది రోజులు ఈ నైవేద్యం తయారీలో యువకులు, యువతులు పాల్గొంటారు. చివరిరోజు సద్దుల బతుకమ్మ అంటారు. ఈరోజు మాత్రం నైవేద్యాన్ని మహిళలు తయారు చేస్తారు.

1.ఎంగిలి పూల బతుకమ్మ : మహాఅమవాస్యరోజు బతుకమ్మ మొదటిరోజు వేడుక మొదలవుతుంది. తెలంగాణలో దీన్ని పెత్రామస అని కూడా అంటారు. నువ్వులు, బియ్యంపిండి, నూకలు కలిపి నైవేద్యం తయారు చేస్తారు.

2.అటుకుల బతుకమ్మ : ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు చేస్తారు. సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు.

3.ముద్దపప్పు బతుకమ్మ : ముద్దపప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం తయారు చేసి సమర్పిస్తారు.

4.నానే బియ్యం బతుకమ్మ :నానేసిన బియ్యం, పాలు, బెల్లం కలిపి నైవేద్యం చేస్తారు.

5.అట్ల బతుకమ్మ : అట్లు లేదా దోశ నైవేద్యంగా సమర్పిస్తారు..

6.అలిగిన బతుకమ్మ : ఈరోజు ఆశ్వయుజ పంచమి. నైవేద్యమేమి సమర్పించరు.

7.వేపకాయల బతుకమ్మ : బియ్యంపిండిని బాగా వేయించి వేపపండ్లుగా తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు.

8.వెన్నముద్దల బతుకమ్మ : నువ్వులు, వెన్న లేదా నెయ్యి బెల్లం కలిపి నైవేద్యం తయారు చేస్తారు.

9.సద్దుల బతుకమ్మ : ఆశ్వయుజ అష్టమి నాడు ఆదేరోజు దుర్గాష్టమిని జరుపుకుంటారు. ఐదురకాల నైవేద్యాలు తయారు చేస్తారు. పెరుగన్నం, చింతపండుపులిహోర, నిమ్మకాయపులిహోర, కొబ్బరన్నం, నువ్వులన్నం.

### బతుకమ్మ సంబరాలు :

దసరా ఆరంభం అయిన దేవి నవరాత్రుల సమయంలో, తెలంగాణ అతివలు బతుకమ్మను ప్రకృతి నుండి లభించే అందమైన పూలతో, పసుపు, కుంకుమలతో తొమ్మిది రోజులు నిష్ఠగా పూజిస్తారు. బతుకమ్మ అలంకరణకు మొదటగా ఇత్తడి పళ్లెంలో గుమ్మడి ఆకులను పరిచి తంగేడు పూలను పేరుస్తారు. గునగు పువ్వును గుత్తులుగా అమర్చి పేరుస్తారు. మధ్యలో ఏర్పడిన ఖాళీ ప్రదేశంలో తంగేడు ఆకులు, మొగ్గలు నింపుతారు. దీన్ని పొట్ట నింపడం అంటారు. తర్వాత గన్నేరు, ఉద్రాక్ష, గోరింట, బీర కాకర, కట్ల,బంతి, చేమంతి వంటి రకరకాల పూలతో త్రికోణాకారంలో గుండ్రంగా అనేక వరుసలతో పేరుస్తారు. ఎత్తుగా పేర్చిన బతుకమ్మ శిఖర భాగాన పసుపు ముద్దతో చేసిన గౌరమ్మను పెట్టడంతో బతుకమ్మను అలంకరించే కార్యక్రమం ముగుస్తుంది. దీపాలతో అలంకరిస్తారు. ఇలా తయారు చేసిన బతుకమ్మను ఇంట్లోని పూజా గదిలో అమర్చి పూజిస్తారు. ఆ తర్వాత బతుకమ్మని బయటకి తీసుకువచ్చి ఆడపడుచులు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలతో గౌరిదేవిని కీర్తిస్తూ పాటలు పాడుతారు. ఆడపడుచులు కొత్త బట్టలు కట్టుకుని, వారికి ఉన్న అన్ని రకాల ఆభరణాలను ధరిస్తారు. పూలతో బతుకమ్మలను ఒకరిని మించి ఒకరు అలంకరించడంలోనే స్త్రీల కళాత్మకదృష్టి అర్థం అవుతుంది. పూలెక్కువ దొరికితే మనిషెత్తు బతుకమ్మను అలంకరించడానికి కూడా వెనుకాడరు. తల్లిపెద్దబతుకమ్మ అలంకరణ అయిన తరువాత చిన్న పళ్లెంలో చిన్నబతుకమ్మను తల్లిబతకమ్మ పక్కనే పెట్టడంలో స్త్రీ సంతాన ప్రదాయిని కనుక తల్లి ప్రక్కనే పిల్ల ఉండాలన్నది సాంప్రదాయం, తల్లిపిల్ల బతుకమ్మలను దేవుడి దగ్గర పెట్టి నువ్వు, శనగ పప్పు, పెసర పప్పు నైవేద్యంగా అర్పిస్తారు. బతుకమ్మ పండుగ కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ ఆడపడుచులు పండగకు వారం రోజుల ముందే పుట్టింటికి చేరుకుని ఆనందోత్సాహాలతో పండుగ సన్నాహాలు చేసుకుంటారు. ప్రతిరోజూ సాయంత్రం ఆ బతుకమ్మ చుట్టూ తిరుగుతూ, బతుకమ్మ పాటలు పాడతారు. బతుకమ్మ పండుగ చివరిరోజు జరిగే వేడుకలను, ఆ వైభవాన్ని చూడటానికి రెండు కళ్ళూ చాలవు. నయన మనోహరకరంగా ఉంటుంది. ఇలా చాలా సేపు ఆడాక మగవారు వాటిని చెరువులో నిమజ్జనం చేస్తారు. ఆపై ఆడవారు వాయినమమ్మా వాయినం అంటూ వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటారు. తరువాత ఇంటి నుండి తీసుకువచ్చిన పెరుగన్నం, మొక్కజొన్నలు లేదా వేరుసెనగ లేదా పెసర విత్తనాలను దోరగా వేయించి పిండి చేసి బెల్లం లేదా పంచదార కలిపిన సత్తుపిండి ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకుని ప్రసాదంలా స్వీకరిస్తారు. బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతారు. ఒకరు ముందుగా పాట మొదలుపెడితే మిగిలినవారు వారితో గొంతు కలుపుతూ పాడుతారు. ఈ జానపద గీతాలు ప్రత్యేకమైన తెలంగాణా సంస్కృతిని ఆవిష్కరిస్తాయి.

### చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్నప్పుడు చూడ చక్కని దృశ్యం :

చీకటి పడుతుంది అనగా, స్త్రీలందరూ ఈ బతుకమ్మలను తలపై పెట్టుకుని ఊరిలో ఉన్న పెద్ద చెరువు గానీ, తటాకంవైపు గానీ ఊరేగింపుగా బయలుదేరుతారు. ఈ ఊరేగింపు అందంగా అలంకరించుకున్న స్త్రీలు, బతుకమ్మలతో అత్యంత సుందరంగా కనబడుతుంటారు. ఈ ఊరేగింపు కొనసాగినంత సేపూ, జానపద గీతాలతో వీధులు మారుమోగుతాయి. జలాశయం చేరుకున్న తరువాత, మెల్లగా బతుకమ్మలను పాటలు పాడుతూ, ఆడుతూ నీటిలో జారవిడుస్తారు. ఆ తరువాత "మలీద" (చక్కెర, రొట్టెతో చేసినది) అనే పిండి వంటకాన్ని బంధు మిత్రులకు పంచిపెడతారు. ఆ తర్వాత ఖాళీ పళ్లెం (తాంబళం)తో బతుకమ్మను కీర్తిస్తూ ఇంటికి చేరుతారు. ఈ తొమ్మిది రోజులూ, ఈ పాటలన్నీ అర్థరాత్రి వరకూ వీధులలో మారు మ్రోగుతూనే ఉంటాయి.

### బతుకమ్మ బ్రతుకు..నీయమ్మా ఉయ్యాల పాటతో ముగింపు :

బతుకమ్మ బతుకమ్మ
బంగారు బతుకమ్మ
మా నోము పండింది
నీ నోము పండిందా
కరోనా మహమ్మారి
ప్రాణాలు తీస్తోంది
దాని బారినపడినారు
వందలు, వేలు, లక్షలు
తనువు చాలించారు
మేము చేసిన తప్పులు
కుప్పల తెప్పలు
మన్నించు మమ్ము
కోటిదండాలమ్మ ఉయ్యాలో
మమ్ము కావగా రావమ్మా
కోవిద్ 19 నుండి ఉయ్యాలో
విముక్తి చేయమ్మా ఉయ్యాలో
మమ్ము దీవించమ్మా ఉయ్యాలో.
శుభం భూయాత్!
సర్వేజనాః సుఖినో భవంతు!



–శారద శృంగేరి
94902 61119

## రాత - గీత

### గ్లోబ్ వార్మింగ్

భూమి
తన చుట్టూ తాను
తిరుగుతూ
ఇప్పుడు
సామ్రాజ్యవాదపు
సాలెగూటిలో చిక్కుకుంది
భూమిపుత్రులారా!
భూగోళం
బుగ్రగా మారకముందే
బుక్కెడు బువ్వకొరకు
పిడికెడు చెమట మట్టిని
పోరాడి
కాపాడుకుందాం రండీ!!



### నో ఛేంజ్



క్యాపిటలిజమని ఒకరు
కమ్యూనిజమని ఒకరూ
మార్క్సిజమని ఇంకొకరు
మావోయిజమని మరొకరూ
ఎన్ని యిజాలు వచ్చినా
'ఏడు దశాబ్దాల'
నా బతుకు యిజాన్ని
మార్చలేదెవ్వరూ..



రాత–శిల్పా జగదీష్
సెల్: 9290827384
గీత–వర్చస్వి

నేటినిజం
# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

గురువారం 15-10-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3




# కాలం మోసుకెళ్లిన పాటల పూల రుతువు



అతడో పాటల పూల రుతువు. స్వరాల మేలి ముసుగు క్రతువు. అతడో రాగ విలాసమెరిగిన స్వర విలాసి. స్వర విరోధమెరుగని విలక్షణ విలసన కలాపి. అతడు విరసమెరుగని విరామం లేని విసుగు చెందని స్వర సామ్రాట్టు. స్వర జ్ఞాన నిధానమైన జన హృదయ విజేత. అతడు సంగీత వన స్వర సౌందర్య సీమల మనమనముల నిలుపు గంధర్వ గాన వనమాలి. అతడో తీయని తన్మయ స్వరం. అతడే బాల సుబ్రహ్మణ్యం.

**"శ్రుతి నీవు గతి నీవు**
**ఈ నా కృతి నీవు భారతి**
**ధృతి నీవు ద్యుతి నీవు**
**శరణాగతి నీవు భారతి"** – అనే స్తుత్యాలాపనతో భారతిని స్మరించి, ఆ నలువ చెలిని మెప్పించి, ఆమె కరుణా కటాక్షసిద్ధినొందారు కనుకనే ఉత్తేజం, ఊర్జితం, ఉద్రేకం, ఉద్వేగం, ఓదార్పు, జాలి, లలి, లాలి, విషాదం, శృంగారం, ఆధ్యాత్మికత, ఆరాధన, చిలిపితనం, వేడుకోలు ఇలా ఎన్నెన్నో అనుభూతి గళ తంత్రుల గాన సరాలను సురానందమందించి తన్మయత్వపు మత్తున ముంచారు మనను.

**"ఏమి ఈ వింత మోహం"** అనే పాటలో ప్రారంభమైన తన స్వర్వార్చన ప్రస్తానంలో దండకాలు, పద్యాలు, యుగళ గీతాలు, సోలో పాటలు, స్తోత్రాలు గానం చేసి జనస్తోత్ర మందుకున్నారు బాలు. వేణువులా బాలు స్వరం శ్రుతిలయలకు సుందరాతి సుందరంగా ప్రాణ ప్రతిష్ట గావించింది.

**"సత్య సాధనకు సత్య శోధనకు సంగీతమే ప్రాణము"** – అని గుర్తెరిగిన బాలు కవుల కలం చిలికిన అక్షర భావం ముభావం అభావం కానీక సంభావనా ప్రభావం పరివ్యాప్తి నందేలా అమరత్వమందేలా, శ్రుతి శుభగంగా రాగాలాపన చేశారు. అంతే కాదు కేవలం అక్షరాలను రాగాలతో జతపరిచి ఆలపించటం కాక అక్షరాల వెనుక ఉన్న ఆద ఆరాటం ఏమో అవగతం చేసుకొని అద్భుతావిష్కరణ చేసే విద్య బాలుకు తెలిసినట్లు వేరొకరికి తెలియదంటే అతిశయోక్తి కాదు. అంటే వారి గళ నాధ గమకాల గమనాల గుణ గణముల గల ఘనత నెంచగలమా!'

**'సంగీతమపి సాహిత్యం**
**సరస్వతీస్తగన ద్వయం**
**ఏకమాపాత మధురం**
**అన్యదాలోచనామృతం'** – అన్న ఈ సత్యం తెలిసి సంగీత సాహిత్యాలనే స్వాధ్యాయముగా భావించి, స్వరాలాపనలో స్వరారోహణావరోహణల స్వారస్యమెరిగిన రసజ్ఞతతో నవకపు నాజూకు రాగాల నవ నవోన్మేషంగా, నలువుగా నయగారంగా నవరస ప్రదర్శనానందాన తెలుగు వాడినని చెప్పుకుని తెలుగు భాష మీద వన్నె తగ్గని ప్రేమతో వర్ణ, పద, శబ్దోచ్చారణా సౌందర్యాన్ని, తెలుగు భాష తీయదనాన్ని అపరిమిత రీతిని తన గాన మాధుర్యంతో నేల నాలుగు చెరగులా చాటి మన హృదయ కేదారాలను గాన రసప్లావితం చేశారు.

ఆయన శ్వాసాలాపనా ధ్వని రాయి వంటి మనసునైనా రామ మందిరంగా ఆరామ సుందరంగా మార్చగల శక్తి రూపం. భక్తిరస రాగిణిగా భావోద్వేగసిక్తమైన బాలు స్వరం– "గిరినందిని శివరంజని భవభంజని జననీ" –అంటూ పాడిన పాట మానసాలను భక్తి పారవశ్యంలో ముంచెత్తుతుంది. అక్షరోచ్చారణా కేళిలో ఆరితేరిన బాలు ఏ వర్ణాన్నెలా పలికితే – ఏ అక్షరాన్నెంత నొక్కి పలికితే కవి ఆశించిన భావం ద్యోతకమౌతుందో తెలిసిన అక్షర మాంత్రికుడు బాలు. భక్తి భావంలో ఆర్ద్రతను కలగలిపి పాడిన పాటలనేకం మనకు తెలుగు గుడిలోని గంటలా మన ఎదల మోగుతూనే ఉంటాయి.

మనశ్శరీరాలనత్యంత ప్రభావితం చేసేది శృంగారం. శృంగార తపనల తమకపు హాయిని తన గాత్ర గారాబాన మరువలేని తీరున మన మనసులను మైమరపించే విధాన వినిపించిన విధానానికి నిదర్శనం.

**"మల్లెలు పూచే వెన్నెల కాసే**
**ఈ రేయి హాయిగా**
**మమతలు తీయగ పెనవేయి**
**నన్ను తీయగా**
**ముసిముసి నవ్వులలో గుసగుస లాడినవే**
**మిస మిస వెన్నెలలో మిలమిలలాడినవే**
**నీ బిగి కౌగిలిలో జాబిలి రాత్రులే**
**కాటుకలంటుకున్న కౌగిలింతలెంత వింతలే"**

– అన్న పాట. ఆభేరి రాగంలో పాడిన ఈ పాటలో బాలు గాత్రం వింత శృంగార రాగపు గారామునెంత గారాబంగా ఒలికించిందో... "మమతలు రేయిగ పెనవేయి నన్ను తీయగా" – అనటంలోనే కాదు పాటంతా కవి రాసిన పద-భావ సౌందర్యాన్ని మచ్చు చల్లినట్లు – ఓ మైమరపు అల అలమినట్లు తన్మయత్వపు మునకలో మునిగినట్లు బాలు గళం చిత్ర విచిత్ర భావ గమకాల సోయగపు సోనలలో ముంచుతుంది. అలాగే అంత అందంగా –

**" చుట్టూ చెంగావి చీర కట్టావే చిలకమ్మా**
**బొట్టు కాటుక పెట్టి నేను కట్టే పాటలు**
**చుట్టీ ఆశపడే కళ్ళల్లో ఊసులాడు వెన్నెల బొమ్మ"** – అంటూ కవి భావుకతకే అందం అద్దేలా మోహనంగా ఆలపించారు. **"మనసే వెన్నెలగా బ్రతుకే పున్నమిగా"** – అని పాడిన పాట వెన్నెలంత అందమైన పాట.

"మానస వీణ మధుగీతం
మన సంసారం సంగీతం" – ఈ పాటలో
**"జాబిలి కన్న నా చెలిమిన్న**
**పులకింతలకే పూచిన పొన్న**
**కానుక లేమి నేనివ్వగలను**
**కన్నుల కాటుక నేనవ్వగలను"** –
ప్రేమ లాలిత్యాన్నంతా వినే మనసునంటేలా అద్భుతంగా పలికించారు.

**"కోవెల్లో వెలిగే దీపం దేవి నా తల్లి**
**కోవెల్లో తిరిగే పాటల గువ్వ నా చెల్లి**
**గువ్వంటే గువ్వ కాదు గొరవంక కాని**
**వంకంటే వంక కాదు నెల వంక కాని"**
అన్న పాటలో చెల్లి పట్ల అన్నకుండే వాత్సల్యాన్ని తన స్వరంలో అద్భుతంగా పలికించారు.

**"జీవితమంటే అంతులేని ఒక పోరాటం**
**బ్రతుకు తెరవుకై పెనుగులాడుటె ఆరాటం**
**కృషి చేశావంటె – ఎదురీదావంటే**
**సాధించేవు గెలిచేవు నీదే జయం"** – అంటూ
నీరస హృదయాలకు ఉత్తేజ ఉత్సాహాలను ప్రబోధించే పాటలతో పాటు, 'పుణ్యభూమి నా దేశం" వంటి దేశభక్తి గీతాలు,

**"రగిలింది విప్లవాగ్ని ఈ రోజు**
**ఆ అగ్ని పేరు అల్లూరి సీతారామరాజు"** వంటి విప్లవాత్మక గీతాలు, "సాపాటు ఎటూ లేదు పాటైనా పాడు బ్రదర్" వంటి వ్యంగ్యాత్మకమైన పాటలు, 'పాట ఆగిందా ఒక సీటు గోవిందా' వంటి సరదా పాటలను ఆయా భావాలను తన స్వరంలో ఆకర్షణీయంగా అద్వితీయంగా వినిపించారు.

రాజశ్రీ, సిరివెన్నెల, వేటూరి, దేవులపల్లి, దాశరథి, శ్రీశ్రీ, నారాయణరెడ్డి మొదలైన ఎందరెందరో రచించిన పాటలను స్వరాల వరాల మూటలుగా, సాటిలేని మేటి సుస్వర పేటలుగా చేసి మన హృదయ శ్రవణాలను నలంకరించారు బాలు.

'సంగీత ప్రేమికులను, రసజ్ఞులను ఉర్రూతలూగించే విధాన సంప్రదాయ సంగీత రీతిని స్వరం సారించి గానం చేసిన గీతాలన్ని కల్యాణి, మోహన, శివరంజని, శంకరాభరణం, హంసనాదం, అరుదైన చారుకేశి ఇత్యాది రాగాలనెన్నింటినో అవలీలగా పాడి వాణినే మెప్పించిన వారు బాలు' నాద రాగ భావమయమైన గాన ప్రవాహాన మనసానందడోలల నూపిన బాలు భక్తి భావోద్వేగాన మోహన రాగంలో – 'శివాని భవాని శర్వాణీ గిరినందిని శివరంజని భవభంజని జననీ

శతవిధాల శృతి విధాన స్తుతులు గలుపలేని నీ సుతుడనే శివానీ' – అని ఆ వీణాపాణిని వేడుకొని సిరివెన్నెల పద సరళిననుసరించి పాట పాడిన తీరు అబ్బురమనిపిస్తుంది.

**"శంకరా నాద శరీరా పరా**
**వేద విహారా హరా జీవేశ్వరా"**– అనే పాటలో
**"మెరిసే మెరుపులు మురిసే పెదవుల**
**చిరు చిరు నవ్వులు కాబోలు**
**ఉరిమే ఉరుములు సరిసరి నటనల**
**సిరిసిరి మువ్వలు కాబోలు**
**పరవశాన శిరసూగంగా**
**ధరకు జారెగా శివగంగా**
**నా గానలహరి నువు మునుగంగా**
**ఆనంద వృష్టినే తడవంగా** ".. అంటూ
**"పదములు తామే పెదవులు కాగా**
**గుండెయలే అందియులై మ్రోగా**
**వేదం అణువణువున నాదం'** – అంటూ
ఎంత పారవశ్యాన్ననుభవించారో .నాకు పంథాలో.. ఎంతగా తమ గమకిత కంఠనాదాన జన ప్రాణ పాదులకు ఆహ్లాదమిచ్చారో..బాలు.

**"ఓంకార నాదాలు సంధానమౌ గానమే శంకరాభరణము**
**శంకర గళ నిగళము శ్రీహరి పద కమలము**
**రాగ రత్న మాలికా తరళము శంకరాభరణము**
**శారద వీణా రాగ చంద్రికా పులకిత శారద రాత్రము**
**నారద నీరద మహతీ నినాద గమకిత శ్రావణ గీతము**
**రసికులకనురాగమై రస గంగలో తానమై**
**పల్లవించు సామ వేద మంత్రము శంకరాభరణము"**
– అంటూ

కవి శంకరాభరణ రాగం గొప్పతనాన్నెంత గొప్పగా నిర్వచించారో అంతే ఘనంగా బాలు స్వరం భావప్రకటనా ప్రదర్శితమైంది.

సర్వులను రంజింపచేసే శివరంజని రాగంలో శోకరసాన్ని ఉత్సాహాన్ని ఒలికిస్తూ బాలు ఆలపించడం ఓ విశేషం. నందానికే ఆనందమిచ్చారు బాలు.

**"అంతర్యామి అలసితి సొలసితి**
**ఇంతటి నీ శరణిదే చొచ్చితిని**
**కోరిన కోర్కెలు కోయని కట్లు**
**తీరవు నీవవి తెంచక**
**భారపు పగ్గాలు పాపపుణ్యములు**
**మేలుకొనపోవు నీవు వద్దనక"** – అంటూ
తన గళ కలశంలో శోక రసాన్నెంతగ నింపారో... ఈ లోకంలో సుఖదుఃఖాలతో అలసిన జీవి ఆత్మజ్ఞానంతో కోరికలన్నీ బంధించే కట్లు వంటివని వాటిని నీవే తెంచాలి అని భగవంతుడి ముందు మోకరిల్లితే – ఇలాగే వేడుకుంటాడేమో..

క్రౌంచ పక్షి విషాదాన్ని తన స్వరాన నింపుకుని విషాదమే వితాకు నందేలా స్వాంతననెరుగని విషాదాన్ని స్వర తంత్రుల సవ్వళ్ళ సుడులు తిరిగి ఎదలను రాపిడి పెట్టేలా

**" ఎవరికి తెలుసు చితికిన మనసు**
**చితిగా రగులునని"** –
**"ఎడారిలో కోయిలా తెల్లారనీ రేయిలా**
**పూ దారులన్ని గోదారి కాగా**
**పాడింది కన్నీటి పాట**
**...................................**
**ఆమనులే వేసవులై**
**రగిలింది ఈ రాలు పూత"** –
**"నిన్ను మరచి పోవాలని**
**అన్ని విడచి వెళ్ళాలని**
**ఎన్నిసార్లో అనుకున్నా**
**మనసు రాక మానుకున్నా"**–
**"తలుపు మూసిన తల వాకిట నే**
**పగలు రేయి నిలుచున్నా**
**పిలిచి పిలిచి బదులే రాక**
**అలసి తిరిగి వెళుతున్నా**
**నా దాహం తీరనిది**
**నీ హృదయం కరగనిది"**– అంటూ



–రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి
9866583907

ఓ భగ్న హృదయపు ఆవేదనను, ఆర్తిని విషణ్ణ హృదయ విలాప రాగాలాప సల్లాప కలాపంగా తన స్వర స్పర్శతో అద్భుతంగా వినిపించారు.

**"ప్రాణము నీదని గానము నీవని**
**ప్రాణమే గానమనీ**
**మౌన విచక్షణ గాన విలక్షణ**
**రాగమె యోగమని**
**నాదోపాసన చేసిన వాడను**
**నీ వాడను నేనైతే**
**దిక్కరీంద్రజిత హిమగిరీంద్ర సిత**
**ఖందరా నీల కంధరా**
**క్షుద్రులెరుగని రుద్రవీణ నిర్ణిద్ర**
**గానమిది అవధరించరా**
**విని తరించరా"** – అని పరమాత్మతో మొరవిడుతూ ఆహ్వానిస్తూ,

**"అణువు అణువున వెలసిన దేవా**
**కనువెలుగై మము నడిపించరావా"** –

అని వేడుకొంటూ సంగీత రససిద్ధుడైన బాలు, గాన పారిజాతి సౌరభమై ప్రాతఃకాల సౌజన్యమై జనాంతరంగ అంతస్సీమల నిలచిన బాలు పాట ఒడిని గుండె తడిని మిగిల్చి అదృశ్యమైనాడు.

బాలు శ్వాస స్వరాలాపన నిలచిన వేళ, అభిమానుల ఆక్రోశమే సంతకమై నిలచిన వేళనైనా వెన్నెల్లో ఆలోజు వంటి సరస రాగ విలసితమైన నీ మధుర గానం వినగలగటం ఏ పూర్వ యోగమో నీ గానంతో ప్రతి హృదయం పులకితమైంది చెంగలువల చందు ఐంది.

క్షితి మృతి లేని తన మధుర గానంతో రస రాగాలూది తెలుగు పలుకు చక్కదనం తెలిపి, అలసితి అంటూ ఈ లోకానికి వీడ్కోలు పలికి, తన గానామృతాన్ని అందించటానికే అంబరాంగణాన రమ్య రసరాగ గంగా తరంగ రంగాన కచేరి గావింప

**"పాడనా తీయగా కమ్మని ఒక పాట"** అని ఊరిస్తూ,
**"పాటగా బతకనా మీ అందరి నోట"** – అని అడుగుతూ,
"ఆరాధనే అమృత వర్షం అనుకున్నా ఆవేదనే హాలాహలమనుకున్నా నా గానమాగదులే" – అంటూనే దివికేగినాడు.

# భండారు విజయ అంతరంగ మధనం

పుస్తక సమీక్ష

1984సం॥లో తొలి కవితా సంపుటి "దీపిక" 2016లో మలి కవితా సంపుటి తడి ఆరని దుఃఖం" యిప్పుడు తాజాగా "అలల అంతరంగం" పేరిట మరో కవితా పొత్తం. యిదీ కవయిత్రి భండారు విజయ కవిత్వ ప్రస్థానం. ఈ మధ్యకాలంలో ఆమె ఓ అయిదు సంకలనాలకు సహ సంపాదకత్వం నిర్వహించడమేగాక సమాజాన్ని, దేశ విదేశాల్లోని విషాద సంఘటనలను నిశితంగా అధ్యయనం చేస్తు మనసు స్పందించినప్పుడల్లా తన అంతరంగంలోని భావోద్వేగాన్ని, కవితలుగా మలిచి మన ముందు వుంచుతున్నారు. ఒక్కో కవిత ఆమె అంతరంగం నుండి ఎగసిపడ్డ ఒక అలగా భావించవచ్చు.

భండారు విజయ ఎంచుకున్న కవితా వస్తువులన్నీ స్త్రీల సమస్యలే. గృహ హింస, పరువు హత్య, మానభంగం, వరకట్న వేధింపు, భ్రూణహత్య, అకాల మరణం, నుసి అవుతున్న బాల్యం, హరించిపోతున్న స్త్రీ స్వేచ్ఛ యిలా సమాజంలోని దారుణ పరిస్థితులకు అద్దం పట్టు కవిత్వం ప్రవహిస్తుంది. వంచనకు గురవుతున్న స్త్రీ అంటే "నేను" వంచనకు గురి చేస్తున్న మగాడిని లేదూ "నువ్వు"ను ప్రశ్నిస్తు, నిరసిస్తు, శపిస్తు సంధించిన కవితాస్త్రాలు యివి. "ఈ అకృత్యాలను ఎదుర్కొనే విధంబెట్టిదనిన" అనే సందేశం కూడా సూటిగానే వినిపిస్తుంది కవయిత్రి.

అసలు కవయిత్రి సంభావిస్తున్న "మగాడు" ఎవరు? తండ్రి, అన్న, తమ్ముడు, ప్రియుడు, కొడుకు, భర్త ఎవరైనా కావొచ్చు. "చివరికి మృత్యువై కబళిస్తాడు" అంటు తీర్మానించేస్తారు. కారణం? "అణచివేత, అహంకారం, అన్ని అకృత్యాల నిక్షిప్తం వాడిలోనే"

ఎందుకు? "రాజ్యం వాడికి మను పగ్గాలను, పితృస్వామ్య భావజాలాన్ని, తల్లి కడుపున జీవం పోసుకుంటున్నప్పుడే.. ఇచ్చేసింది" అందుకట?. ఆమె దృష్టిలో **"చిక్కుముడులు విప్పలేని శవంలా/ మనిషెప్పటికీ అంతుచిక్కని పజిలే"! ఈ పజిల్ని ఛేదించే రోజులొచ్చేశాయి** అని హెచ్చరిస్తున్నారు విజయ. **"మేమిప్పుడిప్పుడే/ శతాబ్దాల సంకెళ్ళు విరిచి/ గమనాలను గ్రహిస్తున్నాం.. నూతన ముగింపును ప్రకటిస్తు.. కదులుతున్నాం"** ఏమిటా నూతన ముగింపు?

**"మొగుడు చల్లగుండాలని/ ప్రార్థించే రోజుల నుండి/ మొగుడెప్పుడు చస్తాడా..అని/ ఎదురుచూసే రోజులొచ్చేస్తాయి'** తస్మాత్ జాగ్రత్త!

**'ఇవ్వటం మాత్రమే తెలిసిన వాళ్ళం**
**ఎప్పటికీ మీకు అర్థం కానివాళ్ళం"**

అంటున్న అబలలల్లో చైతన్యం ఎలా వెల్లివిరిస్తోందో చూడండి.

**"ఇప్పుడిప్పుడే కళ్ళు విప్పుతున్న వాళ్ళం**
**సంకెళ్ళు తెంచుకుంటున్న వాళ్లం**
**ప్రశ్నించటం నేర్చుకుంటున్న వాళ్ళం**
**ఇక హద్దులు గీస్తే ఆగని వాళ్ళం"**
**అంతేనా? "ఎప్పటికీ మీకు అర్థం కానివాళ్ళం"**

అంటు నేటి స్త్రీల అంతరంగాన్ని ఆవిష్కరిస్తున్నారు కవయిత్రి.






**"ఆర్థిక సమానతోనే సాధికారిత**
**స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలే**
**మా అస్థిత్వాలు"** అని తేల్చేస్తున్నారు విజయ.

బంధాలతో సంబంధం లేదు. మగాడైతే చాలు. "అనేకాకాశాలు" అనే కవితలో కవయిత్రి కలం ఆవేశం గమనార్హం.

**"పాతాలను చెప్పాల్సిన పంతుళ్ళు**
**సహానుభూతిని పంచాల్సిన స్నేహితులు**
**కన్నవారు.. తోడబుట్టిన వారు**
**బాబాయిలు.. మామయ్యలు**
**తాతలు.. వారి తండ్రులు**
**బంధువులు.. వారి గణాలు**
**కట్టుకున్న వాడెవడైనా**
**మనిషితనాన్ని, మృగ్యం చేస్తుంటే**
**క్షణ క్షణం కుమిలిపోయి**
**గాయాలకు లేపనాలు పూస్తూ**
**నిరంతరంగా పారుతున్న సెలయేరై**
**ఆమె**
**అనేకాకాశాలను మెస్తూనే.."**

యివీ కొన్ని కవిత్వ పంక్తులు.. "పాపం ఆమె" అనిపిస్తోంది కదూ!

యిలా.. స్త్రీ అంతరంగాన్ని వినిపిస్తు రాసిన అనేక కవితల్తో బాటు పురుషుడి మనఃస్థితిని గూడ బహిరంగం గానే ప్రకటిస్తున్నారు విజయ.

గృహ హింసను భరించలేక ఆమె ఒంటిమీద వున్న ఆభరణాలతో ఇల్లు విడిచి వెళ్ళి పోయిందట. **"బజారుకని చెప్పి వెళ్ళింది/తిరిగి రాక పదిరోజులైంది"** అందుకని ఆమె భర్త ప్రకటన విడుదల చేస్తున్నాడు.

**"నీకు రావటం ఇష్టం లేక పోయినా**
**కనీసం విడాకుల పత్రాలపై సంతకాన్నైనా పంపు"**

ఇంటిపని, పిల్లల పెంపకం, బామ్మర్దుల బెదిరింపులు, పోలీసుల వేధింపులు, ఉద్యోగ బాధ్యతలతో సతమతమవుతున్న అతడు భార్య ఆచూకీ తెలియజేసిన వారికి పారితోషికం ప్రకటిస్తున్నాడు. బ్రతికి వున్న సమాచారంగాని, చనిపోయిన ఆనవాళ్ళుగాని ఏదైనా సరే.. వెంటనే తెలియజేయమని అర్థిస్తున్నాడు. కొస మెరుపు ఏమిటంటే..

**"నీవు వున్నావో లేదో! తెలిస్తేనే కదా**
**ఇన్సురెన్స్ పాలసీలు వచ్చేవి!!"** ఇదీ కవితాత్మ.

కవయిత్రిది స్త్రీ వాదమా? పురుష ద్వేషమా? పాఠకులకే వదిలేస్తున్నాను.

యిక సంఘటనలను కవితలుగా అల్లిన సందర్భాలు కూడా చాలానే వున్నయి.

ఇటలీలో ఓ తాత తాను దత్తతకు సిద్ధంగా వున్నానని వేడుకుంటున్న "తాతయ్య దత్తత" గోవా ఉద్యమకారుడు బిస్మార్క్ తల్లి 90 ఏళ్ళ వృద్ధురాలు ఇస్తలిస్ డయాలిస్‌ను కలిసిన సందర్భంగా రాసిన "మరియా ఇస్తలిన్ డయాస్", తాలిబన్ల బారిన పడ్డ 'ఓ అఫ్గన్ అమ్మ' ఖలీల్ జిబ్రాన్ కవిత చదివింతర్వాత రాసిన "కలల పడవ" మానసికంగా చేస్తున్న "పరువు హత్య" నాలుగు సంవత్సరాల పసికూనపై అఘాయిత్యం జరిపిన ఓ మృగాడి పైశాచికత్వాన్ని దృశ్యమానం చేసిన "చిట్ట చివరి లేఖ", సిరియా శరణార్థుల శిబిరాలపై జరుగుతున్న వైమానిక దాడులను ఖండించిన **"ప్రశ్నించటమే తప్పైన చోట"** ఇత్యాది కవితలు కడు హృద్యంగా, ఆలోచనలు రేకత్తించేవిగా వున్నాయి.

ఈ సంపుటిలోని కవితలన్నీ చదివింతర్వాత పురుషుడిపై కవయిత్రి దాడి చేసిందనిపిస్తే అది పాఠకుడి తప్పుకాదు. విషయ వ్యక్తీకరణలో స్పష్టత లోపించడం కారణం కావొచ్చు. ఒకే వస్తువును కేంద్రంగా చేసుకుని రాసిన అనేక కవితల్లో వైవిధ్యం కొరవడిందేమోననిపించక మానదు.

ప్రముఖ సాహితీ విదుషీమణి కాత్యాయనీ విద్మహే అభిప్రాయబడినట్టు సుదీర్ఘంగా కాక మరింత చిక్కగా కవితల్ని తీర్చిదిద్దుతే బాగుండేది. సుదీర్ఘంగా సాగిన కవితలలో పాదానికీ పాదానికీ మధ్య కర్త, కర్మ, క్రియల నడుమ మరియు భిన్న, కవితా భాగాల మధ్య అన్వయంపై మరింత శ్రద్ధ పెడితే బాగుండేదని నాకు కూడా అనిపించింది.

నిరంతరం అధ్యయనంతో, నిర్విరామ సాధనతో ఈ చిన్ని చిన్ని లోపాలను కవయిత్రి అధిగమించగలదని, మరింత వైవిధ్యభరిత కవిత్వంతో త్వరలో కవితా ప్రియులను అలరిస్తుందనీ నా నమ్మకం.



– రమణ వెలమకన్ని
సెల్: 9866015040

**ప్రతులకు:** బండారు విజయ
హెచ్ఐజి బ్లాక్-1ఫ్లాట్-10, బాగ్‌లింగంపల్లి
హైదరాబాద్-500 044
సెల్: 8801910908

# మానసిక ప్రశాంతతకు 'భక్తి సంగీతం దోహదం'




కేవీ శివకుమార్‌ను సత్కరిస్తున్న అతిథులు.

మానసిక ప్రశాంతతకు భక్తి మార్గంతో పాటు భక్తి సంగీతం దోహదపడుతుందని నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు అన్నారు. శివకేశవులు సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం శ్రీ త్యాగరాయ గానసభలో భక్తి సంగీతం వీనుల విందుగా జరిగింది. సభలో గాయకుడు కేవీ శివకేశవులను అతిథులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి రఘుశ్రీ, సీతమ్మ, మోహన్, జయలక్ష్మి, డా॥శర్మ పాల్గొన్నారు.

# విశ్వ విషాదయోగం

అనుభవంలోకి వచ్చేదాకా
ప్రతి ఊహ ఒక వింతే!
సాకారమయిన ఒక కొత్త యదార్థజీవితం
అలవాటయిన జీవితంగా మారిపోతున్నది
భూమి.. గడియారాలు తిరుగుతున్నా
అందరికీ కాలం ఆగిపోతున్నట్లున్నది
మనకు మనం విధించుకున్న సెలవుల్లో
నెలవుల్లోనే బందీలుగా ఉండిపోయాం
చరిత్రపుటల్లోకి నడిచి చదువుకుంటే
మనిషిగా ఎన్ని విపత్తులు ఎదిరించాం
ఎన్నెన్ని ఘోర ఉప్పెనల తీరాలు దాటాం
మరెన్నో మహమ్మారులను మట్టుబెట్టాం కదా ...
మేధోసంపత్తితో అవయవాలను కూడా మార్చగలిగాం
సైన్స్ బుజాలమీద కూర్చొని
శతాబ్దాలుగా ఊరేగుతూనే ఉన్నాం
మొహాలకు మాస్కులతో మరో ప్రయాణం మొదలైంది
ఎక్కడికెళ్లినా హ్యాండ్ శానిటైజర్
వదలలేని అలవాటుగా మారుతోంది
తోసుకుంటూ అరుచుకుంటూ
చాంతాడు లైన్లలో నిలుచునేవాళ్ళు
ఒకరికొకరు అంటీముట్టని దూరం పాటిస్తున్నారు
ఆలింగనాలు .. కరచాలనాలు పోగొట్టుకున్నాం
చిన్నప్పుడు అమ్మ అనేది
బయటికి వెళ్లకు .. బూచాడున్నాడని
ఇప్పుడు నిజంగానే నిజమయ్యింది
ఇప్పటిదాకా నాలుకతోనే విషం చిమ్మిన మనిషి
శరీరంకూడా విషాన్ని విస్తరింపజేస్తుందని
ఒక రంగుల బుడగలా భవిష్యత్తు మాయమవుతుందని
మనమంతా మనకి మనం దూరంగా మసలాలని
మానవజాతి ఇంకొన్నాళ్ళు
మనగలగాలంటే
ఈ విశ్వ విషాదయోగానికి
అర్థ తాత్పర్యాలు రాసుకుందాం



–డా. సి. భవానీదేవి
9866847000

# పచ్చని తండ్లాట

మనిషిని కట్టడి చేయడానికి
కాళ్లు చేతులు కట్టేయాల్సిన పనిలేదు,
కన్నపేగుని మెలిబడితే చాలు –
ఎంతటి కొట్టుకులాట...!
ప్రాణం తోడేసేస్తున్నట్టు ఒకటే ఆగం...!
ఎన్ని సంగతులనీ.. ఎన్ని మాటలనీ..
ఎన్ని సందర్భాలని.. గుర్తుపెట్టుకుంటాం?
మనసు చంపుకుని దేన్నని చెరిగి పోస్తాం..?
అన్నీ కావాల్సిన క్షణాలే...
బంధాల తీగల్ని మరింత
పెనవేసుకోవాల్సిన గడియలే..
అయినా –
పయనించే దారిలో పూలే ముల్లై గుచ్చుకుంటే
నడకెలా సాగుతుంది ?
ఆరాటాల వెనుక ఒక ఆందోళనల బావి
నోరు తెరుచుకుంటుంది –!

జ్ఞాపకాల మూటని జీవితాంతం
దాచుకున్నప్పుడే అసలైన జీవితం!
అవసరాల అంగడిలో
ఒక్కొక్కటి జారవిడుచుకున్నాక
నాటుకున్న ఆత్మీయతల తడి తగలదు–
పంచుకున్న ప్రేమస్పృహ కోల్పోయినజీవితాలు
రాను రాను తీయటి స్పర్శని కోల్పోతాయి –!
ఒక వైపు చూడటమో..
భేదాల ఒంటికన్ను తో చూడటమో..
రానివాళ్ళకిప్పుడు తిప్పలెక్కువవుతోంది– రూపాయి
లెక్కలతో కొలుచుకుంటున్న తాడు
కోరికల బొంగరాన్ని ఎంత కాలం తిప్పుతుంది ?
కాలం వెంట పొగసూరుతున్న బంధాలు
ఎన్ని రూపాల్లో చిగురిస్తాయి..?
నీడనివ్వని చెట్టులా
ఎంత ఎదిగితే మాత్రం ఎం లాభం?
ఒక భవిష్యత్తు చిత్రపటాన్ని గీసుకుని
పదే పదే భయపెట్టడాన్ని ఇప్పుడేమంటాం–?
ప్రేమని కొలతల్లో పంచలేని
అమ్మ కదా!
ఎన్ని ధక్కా ముక్కీ లెదురైనా ..
గుండెల్లో అంతుచిక్కని ఒక తండ్లాట–
పేగు బంధాలన్నీ తడి ఆరకుండా
ఎప్పుడూ పచ్చగుండాలనే–!!



– మోతుకూరి అశోక్ కుమార్
9247380976



## వలస వేదన

ఏడుస్తూ తెరుచుకున్న కళ్లు
ఏడ్పుల మధ్య మూతపడేదాక
పోరు...బ్రతుకు పోరు
గుప్పెడు మెతుకుల కోసం
గుక్కెడు నీటి కోసం
కాసింత నీడ కోసం
మైళ్లు...వేల మైళ్లు
మైలు రాళ్లను వెనక్కి తోస్తు
పయనం..అలుపెరుగని పయనం
నన్ను కన్నోళ్లను
నేను కన్నోళ్లను
చివరికి కట్టుకున్న యిల్లాల్ని
వదిలిన పయనం
నా కాళ్లు ఈ నేల మీదే
మట్టి వాసన
ఏ మాత్రం నాది కాదు
చుట్టూ జనాల గుంపులే
నా వాళ్లెవరు కానరారు
ఎడారుల్లో...
ఒయాసిస్సుకై వెదుకులాట
ఇసుక తిన్నెల్లో...
నాణాలకై దేవులాట
ఉన్నట్టుండి...
ఓ సునామిలా...
మరో భూకంపంలా...
మహమ్మారి...
చాపక్రింది నీరులా..మహమ్మారి
బెంగ...
ఏ దిక్కునుండి వస్తుందో
తెలియని బెంగ
ఎవరిని కాటేస్తుందో
అర్థం కాని బెంగ
ఇంటిపైకి మనస్సు మళ్లిన బెంగ
నా నేలలోనే...ఆరడుగుల
జాగ కోసం బెంగ
నా వాళ్ల మధ్యే...
చివరి ఘడియల కోసం బెంగ
అదేపనిగా ఆకాశం వైపు చూపు
నక్షత్రాలెన్ని ఉన్నాయనో కాదు
ముడుచుకున్న రెక్కల్ని
విమానాలెప్పుడు విప్పుకొంటాయో
క్షణాల లెక్కింపుల బెంగ

-డా॥ పాక వెంకటేశ్వర్లు
9849436891

## పొదుపు విదుపులు

మూగజీవాల రోదన
మనకు ప్రకృతిలో ప్రయాణ అనుభూతి
(జంతుప్రదర్శనశాల)

ఆకలితీర్చే క్షేత్రం
గృహిణికి నిరంతరం అస్త్రశస్త్రవిన్యాసం
ఆహారోత్పత్తి ,( వంటగది)

ప్రకృతిలో వనరు
ధరణిలో మనకు సమకూరు
(అదే ఊటనీరు)

పక్షుల కిలకిల రావాలు
ధరణికి పచ్చలసొబగులు
(వర్షఋతు సూచన)

ఎగిరే తుండుగుడ్డా
పనికిరావు నీవు కిందపడ్డా
(చేరుమాలు)

గాలిని ఇచ్చే తిరుగలి
అది ఆగిందా మన పని కథాకళి
(సీలింగ్ ఫ్యాన్)

రుచికి రారాజు
అది లేనిదే గడవదేరోజు
(లవణం)

మధ్యతరగతి జీవుల
వేసవి విడిది
(ఎయిర్ కండిషన్ గది)

మోతమోగటం చేత
హస్త భూషణం అయ్యింది అంచేత
(చరవాణి)

కవితకు కాదేది అనర్హం
పలు సంస్కృతులలో భిన్నం ఆహార్యం
కంటికి ఇంపైనదే ఆహ్లాదం
(దుస్తులు)

దేవుళ్ళకు రెస్టింగ్ ప్లేస్
మనకు డివైన్ డెకరేషన్ ప్లేస్
(పూజగది)

పలువస్తువులకు ప్రదర్శన ,అందరికి ఆకర్షణ
డబ్బు ఖర్చుపెట్టాలంటేనే సంఘర్షణ
(సూపర్ మార్కెట్)

కళ్ళుమూస్తే మత్తుగా
మేను వాలిస్తే మెత్తగా,నిద్రాదేవి హత్తుకోగా
(మెత్తటి పాన్పు)

రక్తాన్ని పీలుస్తాయి, నిద్రను హరిస్తాయి
దానికి విరుగుడు ఫటాఫట్
(దోమలబ్యాట్)

వేసుకొంటే సంతృప్తి, చూసే కళ్ళకు ఆసక్తి
కొనాలంటేనే చేస్తుంది అశక్తి
(బంగారం)

ఒక దీపం ఆరగానే, మరో దీపం
వెనువెంటనే తన తోటి దీపాలతో ఉంటుంది
(చంద్రతారకలు )

అస్థికల అస్థిత్వం తగ్గినపుడు
నడకకు తీసుకో నా ఆసరా అంటుంది
(చేతికర్ర )

తెల్లని పలకల్ని పలుమార్లు
అన్నివైపులా నుండి శుభ్రపరుస్తుంది
(టూత్ బ్రష్)

సమస్తజ్ఞానానికి ఆలవాలం,అన్ని ప్రశ్నలకు
సమాధానం ,ఒకే కిటికి గుండా శోధన
(అంతర్జాలం)

నిలువైనదే ఆకారం
విలువైన వస్తువుల స్థావరం
వస్త్రాలకదే ఆధారం
(బట్టల బీరువా)

చూస్తే చిన్నగుండు ,
తీక్షణ కళ్ళు,వాడివినికిడి,కల్గి ఉండు
కన్నవిన్న వాటిని పట్టి బంధించి
రేపటి సాక్ష్యంగా మార్చును
(సిసి కెమెరా)



-సంధ్య సుత్రావె
9177615967

## మనిషీ!!...నిన్ను గెలవలేకపోతున్నా.

నిన్నూ,,
నీ సుందర భూగోళాన్నీ
నా ముళ్ళ కిరీటంలో చొప్పించి
సమస్త జీవరాసినీ గుప్పిట పట్టాలని కలగన్నాను.
నీ విశ్వాసాల్ని పూర్తిగా గుల్లబర్చాలని
నీ విజ్ఞానాన్ని డొల్లపుర్రెగా అభివర్ణించాలని
వైద్యానికి అందని విధ్వంసక రూపంలో
అదృశ్య శరాన్ని ప్రయోగిస్తున్న ప్రతిసారీ..
సేవా ప్రతిశరముతో నిర్వీర్యం చేస్తున్నావు.
ఇంటినీ, ఒంటినీ పరిశుభ్రం చేసుకుంటూ
నలుసుగానే నన్ను అంతం చేయాలని
కొండంత పథకం రచిస్తున్నావు.
ముఖానికి మాస్క్ రక్షా కవచం ధరించి
శోకకారణినైన నా ఉనికిని వెలివేస్తూ
ఒడుపుగా తప్పుకు తిరుగుతున్నావు.
లాక్ డౌన్ పేరుతో లోకం తలుపులు బిగించి
నడి వీధిలో నన్ను అనాధలా నిలబెట్టి
మరణ శాసనం రచిస్తున్నావు.
'సామాజిక దూరం' సూత్రం ప్రతిపాదించి
పవిత్ర నమస్కారం యొక్క ప్రయోజనం తెలిపి
దరిచేర వీలులేని ఆంక్షల సంకెళ్ళు వేస్తున్నావు.
విపత్తును కూకటివేళ్ళతో పెకలించేందుకు
'క్వారంటైన్' ప్రథమ చికిత్స తో
'ప్రివెన్షన్ ఈస్ బెటర్ దెన్ క్యూర్' అంటూ
ముందుచూపును ముద్దుగా అమలుచేస్తున్నావు.
నే కూల్చిన దేహపు శకలాల్ని పోగేసి
ప్రాణంపోసి మానవత్వాన్ని నిలబెడుతున్నావు.
నే చేసిన గాయాల మరకల్ని
ఐసోలేషన్ మంత్రమేసి మటుమాయం చేస్తున్నావు.
నీ స్వార్థాన్ని పావుగా వాడి
మాయాక్రీడలో నిన్నే మట్టుపెట్టాలనుకున్నాను.
కానీ,,నువ్వు ప్రకటించిన యుద్ధమే గొప్పది!
నువ్వు నమ్ముకున్న వ్యూహమే పదునైనది.
నీ చుట్టూ ప్రేమ అనే సురక్షా కవచముంది.
నీ సాహసంలో సేవా దక్షత కనబడుతుంది.
జాతిని కాపాడుకునే తపనతో
కంటికి కనబడని నాతో పోరాడుతున్నావు చూడూ!
ఆ సంకల్పం ముందు తలవంచుతున్నా!
మనిషీ !...నిన్ను గెలవలేకపోతున్నా.



-చొక్కాపు.లక్ష్మu నాయుడు
9573250528

## చదువరి - జ్ఞాన నిధి

తల్లిదండ్రులు జన్మనిస్తారు
గురువులు జీవిత మార్గాన్ని చూపిస్తారు..!

గరువులు...!
అపార విజ్ఞాన సంపద గల జ్ఞాన నిధులు
జగతిలో విద్యా వర్షం కురిపించు మేఘాలు
అంధవిశ్వాసపు చీకటిని పారద్రోలు రేరాజు
పంచభూతాదీనులు,నటరాజ వరపుత్రులు
గురువులార మీకు వందనం....!

గరువులు...!
ఆలోచన సాగరాన్ని చిలికి
జ్ఞానామృతం పంచేవారు
మనసా,వాచ,కర్మలకు మంచిని నేర్పేవారు
అరిషడ్వర్గాలను అదుపు చేసేవారు
జీవిత సవాళ్లను ఎదుర్కొనేందుకు
తర్ఫీదు నిచ్చే గురువులార మీకు వందనం.!

గరువులు...!
నిరాడంబరత,నిస్వార్థానికు నిదర్శనాలు
ప్రపంచాభివృద్ధికి సాక్షి భూతాలు
విశ్వ మానవాళికి నడత నేర్పినవారు
చరిత్ర సారాలను వడపోసే
గురువులార మీకు వందనం.!

గరువులు...!
వినయ విధేయతల విలువలు చెప్పేవారు
విద్యార్థుల ఉన్నతిని ఆకాంక్షించేవారు
విద్యార్థులనుండి ఏది కాంక్షించనివారు
వారి ఎదుగుదలను చూసి గర్వించేవారు
సంస్కృతి, సాంప్రదాయలకు
విలువల వలువలు చుట్టే
గురువులార మీకు వందనం.!



– ఆకుల.వెంకటరమణ
94417 17212

## తరాలకు వారధి

వాలుకుర్చీ వరండాలో ఎంత ఠీవిగా దర్శనమిస్తుందో బాల్యంలో వేసవి సెలవులకు అమ్మమ్మగారింటికి వెళ్ళినప్పుడు....
విశాలమైన చతుశ్శాలభవంతి వంటింట్లో అమ్మమ్మ మడిగట్టుకొని వండడాలు...
తాతయ్య తెల్లదోవతి కట్టి భుజంమీద కండువతో ఒంటినిండ పట్టెవర్ధనాలతో ఎంతచక్కటి రూపమో...
తనకోసం వచ్చిపోయే ఊరిజనాలతో ఆఇల్లు ఎంతో కోలాహలంగా ఉండేది...
మేము ఓమూలన కచ్చకాయలు ఓనగుంటలు అష్టచెమ్మ ఆడుకుంటూ ఉన్నా నాచూపులెప్పుడూ ఆ వాలుకుర్చీ పైనే...
ఎప్పుడు కూర్చోవాల దాంట్లో అనుకునే దాన్ని కూర్చుందామంటె భయం ఏడ తాతయ్య గద్దిరిస్తాడో అని...
ఊరునుండి పోయేలోపు ఒక్కసారన్నా కూర్చోంది మనసునబట్టెది కాదు
అప్పుడనిపించేది "హమ్మయ్య" అని...
ఎంత పెద్ద సాహసమో నాకు అది చూసిన అక్క తాతయ్య రాని చెబుతానంటు బెదిరింపులు...
రచ్చబండ కు వెళ్ళిన తాతయ్య పెద్దపులోలె సరాయించుకుంటూ ఇంట్లోకడుగుపెట్టగానె దొంగల్లా నక్కి చూసెటోళ్ళం...
కాళ్ళు చేతులు కడుగుకోని అన్నంతిన్న తరువాత అమ్మమ్మ కట్టిచ్చే తాంబూలం నములుతూ కాసేపలా వాలుకుర్చీలో ఒరిగి....
ఆరోజటి ఊరుముచ్చట్లు తాను చెప్పిన తీర్పులను అమ్మమ్మ కు చెప్పుకుంటూ సేదతీరేవాడు....
ఇప్పుడా వాలుకుర్చీ చెదల్పట్టి తాతయ్య జ్ఞాపకాలతో ఇంకా నేనున్నానంటూ
తరాలకు వారధిగా పటాటోపం ప్రదర్శిస్తోంది పాపం సగం కూలిన వరండాలో...



-వకుళ వాసు
9989198334

## ఏ కార్పో "రేటు" హాస్పిటల్

అదో కార్పో "రేటు" హాస్పిటల్
డబ్బు జబ్బు పట్టిన
బహుళ అంతస్తుల భవనం
జాతరలా పోలి ఉన్న ఇంద్రప్రస్థనం

చక్రాల కుర్చీలో ఒకరు
బతకాలన్న ఆశతో
స్ట్రెచర్ పై మరొకరు
జనన మరణాల సమ్మిళితం
అదో ప్రత్యేక ప్రపంచం...

ఏ గదిలో ఏం జరుగుతుందో
తెలియని అయోమయం
ఆర్తనాదాలు ఒకవైపు ...
ఆనంద భాష్పాలు మరోవైపు ...

చంకలో ఫైలుతో
ఏ వైద్యానికి ఏ గదిలోకెళ్ళాలో
బిక్కమొహాలతో రోగి బంధువులు
రకరకాల పరీక్షలు
వేలాది రూపాయలకై

పరుగు పందాలు....
డబ్బు చేత్తో పట్టుకొని
క్యాష్ కౌంటర్ ముందు
చాంతాడంత లైను

హాస్పిటల్‌కు
నేనే హెడ్డునని ఫీలయ్యి
రోగి బంధువులపై
సెక్యూరిటీ గార్డు హూంకరింపులు

ఐసీయూ, ఆపరేషన్ థియేటర్‌లో
ఏం జరుగుతుందో
ఎవరికీ తెలియని అయోమయం
కొత్త సినిమా రిలీజ్ ను తలపిస్తున్న
హాస్పిటల్ మెడికల్ షాపు

తుడిచే వాళ్ళు తుడుస్తూ
ఊడ్చే వాళ్ళు ఊడుస్తూ
నవ్వేవాళ్ళు నవ్వుతూ
ఏడ్చేవాళ్ళు
గట్టిగా ఏడ్చే స్వాతంత్ర్యం లేక
లోలోపలే కుమిలిపోతూ....

ఇలా అన్నీ ఒకేసారి కలగలిసిన
అదో వింత లోకం...



-మాధవ్ గుర్రాల
94926 48887

## మెరుపులు

చిన్ని కృష్ణుడు
అష్టమిన పుట్టెను
దేవకి బిడ్డడు
యశోధమ్మ పెంచేను

చెరసాలలో పుట్టెను
ఆబాల గోపాలుడు
రెపల్లెలో పెరిగెను
అల్లరి కృష్ణుడు

అష్టమ అవతారము
పొందెను శ్రీకృష్ణుడు
అవతరించె దైవము
దుష్ట శిక్షకుడు

గోవర్ధనగిరినెత్తిండు
గోవులను కాపాడెను
చిన్నిబాల కృష్ణుడు
రక్కసులను చంపెను

గొల్లవారి ఇంటన
తినేను వెన్నను
అత్తకోడళ్ల మధ్యన
గొడవలను పెట్టేను

మన్నుతిన్న కృష్ణయ్య
యశోధకు నోటిలోన
బ్రహ్మాండం చూపెనయ
యశోద మిన్నకుండెను

ఖురుక్షేత్ర మందున
గీతను భోధించెను
పాండవుల పక్షాన
రణమందున నిలిచెను

గోపికల ప్రియుడిగా
చీరెలను దాచేను
ద్రౌపదికి యన్నగా
చీరనిచ్చి కాపాడెను

సత్యభామ సఖుడవు
రుక్మిణమ్మ భర్తవైన
తులసికి సరితూగావు
తులాభారము యందున

నరకాసుర సంహారము
చేసితివి కృష్ణా
కరోనాను అంతము
చేయుము కృష్ణా

-శీలోజు శోభన్ బాబు
9676858160

## కరోన నినాదాలు

పడకు కరోన బారి
అదో మహమ్మారి

కరోన క్రమశిక్షణ
ఇచ్చింది మనకు శిక్షణ

దేశమంతా లాక్ డౌన్
కరోన డౌన్ డౌన్

మాస్క్ లేకపోతే
కరోన ఉస్కో

ఇది ఓ బయో వార్
హతంచేస్తాం ఖబడ్దార్

శుభ్రతే మన మందు
అదే పాటించు ముందు

కరోన తో విద్య లాస్
అవుతాం అంతా పాస్

కరోన అంతం
కావాలి మన పంతం

కరోన ఓ మత్తు
చేస్తాం దాన్ని చిత్తు

కరోన కాలం
తెచ్చింది కష్టం

కరోన అదృశ్యం
దేశ ప్రజల విజయం

కరోన కాటు
పేదలకు పోటు

వచ్చింది కరోన వ్యాక్సిన్
అదే ప్రజలకు ఆక్సిజన్

లేదెక్కడా పాజిటివ్
అంతా నెగిటివ్

ఇంట్లో ఉంటే లూటీ
బైటకు వెళితే లారీ

కరోన తో బంధువులు దూరం
మిగిలింది ఆదాయం

ప్రతి కవి రాశాడు నా పై కవిత్వం
ప్రతి కవి రాశాడు నాకు మరణ శాసనం

రాజ్యాలు కరోనాకు దాసోహం
రాజ్యాలే కుదిర్చాయి దాని పైత్యం

అందరి నోట కరోన మాట
అందరి నోట కరోన పాట

ఆరోగ్యానికి నిమ్మరసం
అందరికి అమృత పాయం



-కనుమ ఎల్లారెడ్డి
93915 23027

## అబ్బా....బాధ.

కసి -కసి -కసి -కోపం- కోపం- కోపం,
చేతకాని తనపు కన్నీటి ఆక్రోశం-
దొర్లి- దొర్లి, పొర్లి- పొర్లి,..బాధ- బాధ
అంతం కాని కన్నీటి కథనాల వ్యధ ?

ఎందుకిలా...? స్త్రీలు చేసిన పాప మేమిటి?
అలనాడొక నిర్భయ, ఓ నాడొక ప్రియా..
ఒకనాడో దిశా , ఈ నాడో మనీషా..
పైశాచిక మానభంగాలతో అంగాంగ కోతల బలి?

లెక్క లేని అకృత్యాలు , తీర్పులేని తిరునాళ్ళు
అతి క్రూరంగా సాముహిక అత్యాచారాలు
కన్నీటి కడవల తో, కరకు మత్తు విందులు.
ఐనా ఆకలి తీరని రాబందులు. ?

కోరిక తీరని తాపం,గంట గంటకు? మధనం
సొమ్మసిల్లిన సొగసు సజీవ దహన కథనం.
మింటి కెగసిన మంటల్లో కాలిపోతున్న మానవత్వం.
తీర్పు నోచని కాయానికి, తిల తర్పణాలిడే కాలం ?

వాద వివాదాల వార్తా ప్రలాపాల నాటక రంగం పై
కాలయాపనలతో కనుమరుగౌతున్న న్యాయం.
కుళ్ళిన వ్యవస్థలో కొట్టు మిట్టాడు కుల వివాదపు-
పాచిక లాటల మంతనాలకు ,అడిగిన వాడు అతం?,

కరోనా సోకిన "న్యాయం" "కోమా"లోకి వెళ్లింది.
వెంటిలేటర్ పై ఆగీ ఆగని గుండె అదురుతోంది.
కళ్ళతో చూస్తుంది, కదల లేనంటోంది.
గుండె కొట్టుకుంటున్నా గోడుకు స్పందించదది ?

మూసుకుపోతున్న మానవత్వపు దారుల్లో
మొలచిన ముళ్ళను కూడా నరకలేని , మొండి-
"కత్తి లాంటి కలం" రాసుకుపోతున్న కవితలు-
ముక్కిన కాగిత పుటల్లో
కన్నీటి సంతాపాలు తెలుపుకుంటున్నాయి ?

-శ్రీమతి.
8097622021

## భరోసా విత్తనాలు

బుడి బుడి అడుగులప్పుడే
భుజాలపై హమాలీ మోతలు
వడి వడి పరుగులప్పుడు
బుర్ర నిండా చదువుల తిప్పలు
ఎక్కలేని నునుపైన కొండలు
కునుకును దూరంచేసే కన్నోళ్ళ కలలు,

మహమ్మారి పుణ్యమాని
ఆన్ లైన్ గోసలు
ఒంట పట్టని ఇంటి పాఠాలు
ఇంతింతై పెరుగుతున్న
మనుమానపు పిచ్చి మొక్కలు
భయపెడుతున్న పరీక్షల భూతాలు,

అయోమయంలో అమాయక
బుద్ధి జీవులు
ఆలంబనకై చాచిన లేత చేతులు
కాలం కాటుకు రెపరెపలాడుతున్న
చిన్ని జ్యోతులు
ధైర్యపు ఇంధనానికై ఎదురు చూపులు,

ఆశల రెక్కలు కట్టుకొని
ఆకాశ వీధిలో విహరించాల్సినోళ్ళు
బంగారు పంజరంలో చిక్కుకున్న
భావి భారత పౌరులు

చిట్టి గుండెల్లో
నాటాలి భరోసా విత్తనాలు
చిరకాలం పొందాలి
కమ్మనైన ఫలాలు.



-గంభీరావుపేట యాదగిరి
9440617611.

## మహా వృక్షం

అడవిలో పెరిగిన మొక్కరా
పశువుల నుండి గాయమాయేరా
మండ్ల కంచెతో రక్షణ పొందేనురా
వాన చినుకులు జీవం పోసేరా
చెట్టుగా పైపైకి ఎపుగా ఎదిగెరా
బాటసారుల నీడకు పిల్చేరా
కాయ పండ్లతో ఆకలి తీర్చేరా
స్వచ్ఛ గాలిని పంచేరా
కలపను ఇంటికి పంపేరా
వంట చెరుకుగా ఆకలి తీర్చేరా
మహా వృక్షమై ఎదిగెరా
వన సంపదను పెంచేరా
పచ్చని ప్రకృతిని ఇచ్చేరా
జంతు పశుపక్ష్యాదుల స్నేహం చేసేరా
చల్లని నీడతో జనుల మదిలో నిలిచేరా
తరతరాలకు నేస్తమయ్యేరా



-ఉండ్రాళ్ళ రాజేశం
9966946084

## పల్లె మ'దూరం'

ముసుగు తీసి నిద్ర లేచి,
పల్లెని నిద్రలేపే ఆలోచనలో
ఆవలించి, ఒక కూర్చు తీసి
వెచ్చని ఎండని పల్లెపై వెదజల్లి,
నిద్రలేపిన సూర్యుడు.

రేకలు వారముందే పల్లెను విడిచి,
పొలం బాట పట్టి పైరుని జూసి
మురిసిన అన్నదాత
పొట్టకొచ్చిన చేనును కోసి
కల్లం లో పేర్చి, కనులార జూసి

పడుగు దులిపిన ధాన్యంరాశిని జేసి,
కాడెడ్లతో ధాన్యాన్ని పుట్లుగా కొలిసి,
ఇంటికొచ్చిన ధాన్యలక్ష్మిని ఆహ్వానించిన రైతన్న.

మరి, పల్లె ఆధునికత సోకని ప్రశాంత సీమా,
పల్లెజనం సత్యనిష్ఠ కలిగిన వనం,
కానీ, సాటి మనిషినీ మందలింపులేని నేటి పట్నం,
ఉరుకుల, పరుగుల జీవితానికే అంకితం.
ఆస్తులు, అంతస్తులున్న ఆనందంలేని అవిటిపట్నం,
మేడలు, కోటలున్న ముఖంలో నవ్వు లేనిప్రాణం

పల్లెకి, పట్నానికి భేదం నిస్వార్థ జీవనం,
పల్లె ప్రగతే దేశానికి కంటివెలుగు,
పట్నం ఎంత ఎదిగిన పల్లె పెట్టె
అన్నం లేకుంటే అధోగతి



-పల్లె రాజు
9666207288

## రైతు

భూమిని నమ్ముకొని,
వ్యవసాయమునే జీవనాధారము చేసుకొని,
కాయకష్టము చేసి,
పంటలు పండించే పసిడివాడు "రైతు"

తన మెరుపు తానెరుగక,
తళ తళలాడవల్సిన తాను,
పంట మెరుపుల కోసము,
వేసిన పంట వృద్ధి కోసము
రేయింబవళ్లు రాజై ,కాపు కాచే కావలియై,
కళ్లలో వత్తులు వేసుకొని
పంటను కాపాడుకొనే ఓ వీర సైనికుడు "రైతు"

ఓ ఏడాది కాలము కలసిరాక,
చేతికి రావల్సిన పంట చేజారిపోయిన,
చేసిన అప్పులు చాంతాడంత పెరిగి
అప్పులు మరింతగా పెరిగినా,
తలరాత బాలేదనుకొని సరిపెట్టుకుంటాడేగాని,
తలపట్టుకుని దిగాలుపడి కూర్చోడు రైతు

రాబోయే ఏడాదిపై విశ్వాసముంచి
భూమి తల్లిపై అపారమైన నమ్మకముంచి
మరల పంటను పండించేందుకు
ఓ ఆశతో ముందుకు సాగే అన్నప్రదాత
అన్నదాత రైతు

అన్నాన్ని యిచ్చే రైతుకు అండగా నిల్చి,
రైతును చులకన చేయకుండా కాపాడుకుంటు
రైతు కళ్లలో ఆనందాన్ని చూసేలా
రైతుకు భరోసానిద్దాం,ధైర్యానిద్దాం
ఎందుకంటే
కేవలము వ్యవసాయము చేసే సమర్థుడు
రైతు ఒక్కడే –
పంటల కల తెల్సిన నేర్పరి–
పంట కళ నేర్చినవాడి కర్షకుడే –
కర్షకుడుకి హర్షానందిద్దాము –
రైతుకు జేజేలు పలుకుదాం



– విశ్వనాథ నరసింహం
సెల్: 9490971589



## తెలుగువారి విశ్వకవి

నువ్వు గీసిన గీత
బొమ్మగా మారింది
నీవు పలికిన పలుకు
పాటలా సాగింది
నీ కలం చెప్పిన చరిత్ర
నవలలా మారింది
అవధానంతో మొదలైన
నీ ఆశు కవిత్వం
జానపదుల చెంతన చేరింది
బహుముఖీన ప్రతిభకు
నీవే ఒక అద్దం
బాపిరాజు పేరంటే
ప్రజ్ఞకు తొలి అర్థం
హిమబిందు
శాతవాహనుల కాలాన్ని
గోన గన్నారెడ్డి
చాళుక్య యుగాన్ని
నారాయణరావు
స్వాతంత్ర్య సంగ్రామ సందర్భాన్ని
కోనంగి
దక్షిణాంధ్ర చైతన్యాన్ని
మాకు నిరంతరం గుర్తు చేస్తాయి
స్ఫూర్తికి సంకేతంగా
ప్రతినిత్యమూ నిలుస్తాయి
ఉప్పొంగిపోయిన గోదావరి సాక్షిగా
నువ్వు కవీంద్రుడివి
తెలుగు సారస్వతానికి రవీంద్రుడివి
అందుకే నేనంటున్నది
మా తెలుగు జాతికి నీవు విశ్వకవివి.

*(అడవి బాపిరాజు 125వ జయంతి సందర్భంగా..*



-మద్దాళి రఘురామ్
సెల్: 9866057777

## గ్రహణం లేని సూర్యుడు

సంపూర్ణ సూర్యగ్రహణం
లోకం చుట్టూ చీకటి
మా ఇంట్లో మాత్రం వెలుగు
నవ్వుతూ వాలుకుర్చీలో
నాన్న

### సరిహద్దుల గాలి

నాకు వెంటనే
తుపాకులు కావాలి
ప్రాణాలు పోతేపోనీ
దేశ సరిహద్దుల గాలిని
పీల్చుకోవాలని వుంది

### క్రొత్త తలగడ

ఒప్పలు అలసిపోయాయి
మా అబ్బాయి భుజం
నా నిద్రను జోకొట్టింది
అంతే ఇంట్లో వున్న తలగడ
వీధిలోకి నడిచింది



-డా. కె.జి. వేణు,
98480 70084

## వృద్ధులను గౌరవించు !

వృద్ధాప్యం
శాపం కాదు
పాపం కాదు

పుట్టుట గిట్టుట
మధ్య కాలం
శరీర గతులు
సృష్టి ధర్మం

ఇంటికి దీపం
ఇల్లాలు,
జ్ఞానజ్యోతులు
తల్లిదండ్రులు

వృద్ధులను
గౌరవిద్దాం
వృద్ధాశ్రమాలకు
సెలవిద్దాం



-యెల్ది సుదర్శన్ పద్మశాలి
9892411067

## అందినవి




**పుస్తకం:** పూలవనం
రచయిత:బండి ప్రసాదరావు
ప్రతులకు:పొడగట్లపని పోస్ట్
రావులపాలెం మండలం
తూ॥గో॥జిల్లా–533 236




పుస్తకం: అక్షరాల 'సంచి' (తం!)
రచయిత: డా॥ రామడుగు వేంకటేశ్వర శర్మ
ప్రతులకు:ఫ్లాట్ నెం. 201, 2వ ఫ్లోర్
ఆర్.వి. టవర్స్, శ్రీ వేంకటేశ్వర బాలకుటీర్
వద్ద, 2/17,బ్రాడీపేట, గుంటూరు–522
002.సెల్: 9866944287




పుస్తకం: సౌందర్య సుగంధాలు
రచయిత: బండి ప్రసాదరావు
ప్రతులకు:పొడగట్లపని పోస్ట్
రావులపాలెం మండలం
తూ॥గో॥జిల్లా–533 236




పుస్తకం: నవోదయ బుక్ హౌస్
రచయిత: కాచిగూడ, హైదరాబాద్
ప్రజాశక్తి బుక్ హౌస్. ఏ.పి.
మరియు అన్ని పుస్తక బ్రాంచీలలో




పుస్తకం: నుడిక్రీడ
రచయిత: ఎలనాగ
ప్రతులకు: 73, నక్షత్ర కాలనీ,బాలాపూర్ (గ్రా),
వయా కేశవగిరి, హైదరాబాద్–500 005.
సెల్: 98669 45424




పుస్తకం: మనసు ఊసులు
రచయిత: బండి ప్రసాదరావు
ప్రతులకు:పొడగట్లపని పోస్ట్
రావులపాలెం మండలం
తూ॥గో॥జిల్లా–533 236




పుస్తకం: మౌనగీతం
రచయిత: జి. శాంతారెడ్డి
ప్రతులకు:ఇ.నెం, 8–5–1/3/డి
శాంతినికేతన్, టీచర్స్ కాలనీ,
మహబూబ్‌నగర్. సెల్: 8008177324




పుస్తకం: తెలుగు వెలుగు శతకం
రచయిత: పెరుమల కైలాస్
ప్రతులకు: ఇ.నెం. 14–76
ఓల్డ్ యస్.సి. కాలనీ,గ్రా॥ &మం॥ భిక్కనూర్,
జి:: నిజామాబాద్.

## జీవయాత్ర

రెప్పపాటులోనె గడిచే- షష్ఠిపూర్తి జీవితం
గిర్రుమంటు తిరిగింది- కళ్ళముందె కాలచక్రం
మరలిచూసుకొంటుంటే ఎన్నెన్ని జ్ఞాపకాలో
తీపిచేదు కలబోసిన ఎన్ని అనుభూతులో

మొన్నమొన్ననే కదా అమ్మ బువ్వ తినిపించింది
నిన్నటికి నిన్నేగా నాన్న నన్ను నడిపించింది
సీతక్క గిల్లిన నొప్పి ఇప్పటికీ తగ్గకుంది
శీనుగాడు తోసినగాయం మచ్చగా మిగిలేఉంది
చిటికెలొన గడిచిన వయసున అనుభవాలెన్నెన్నో
కోల్పోయిన నా బాల్యం మూల్యమెన్నెన్నికోట్లో

రాధకీయని ప్రేమలేఖలు రాశులుగా పెట్టెలొ మూల్గే
మధుగాడితొ పోటీపడ్డా ఆ మాత్రపు కొలువే దొరికే
గీతతో మనువైతేనేం బ్రతుకు బృందావనమై సాగే
పుట్టిపెరిగి అంతలోనే సంతతి నను మించి ఎదిగే
పదోన్నతులు పొందీపొందగ పదవి విరమణా అయిపోయే
రెక్కలొచ్చి పిల్లపక్షులు భృతివెతుకుతు ఎగిరిపాయే
మాకు మేమై నాకునేనై అనంత జీవయాత్రాయే



-డా॥గొల్లపెల్లి రాంకిషన్
9849693324.

## మాటలే మంటలైతే...

మంటలు మంటలు మంటలు
ఎక్కడ చూసిన మంటలు
ఎందులో చూసిన మంటలే

ఇండ్లల్ల మంటలు
ఇడుపుల్ల మంటలు

మాటల్ల మంటలు
మనసుల్ల మంటలు

నీళ్ళళ్ళ మంటలు
నిప్పుల్లమంటలు

మంటలు మంటలు మంటలు
కండ్లల్ల మంటలు
కడుపుల్ల మంటలు

రాళ్ళల్ల మంటలు
రప్పల్ల మంటలు

అడవుల్ల మంటలు
అంగట్ల మంటలు
మంటలు మంటలు మంటలు

గుళ్ళల్ల మంటలు
బళ్ళల్ల మంటలు

గనులల్ల మంటలు
పనులల్ల మంటలు

మంటలు లేనిదెక్కడ
మాటలు పేలనిదెక్కడ?
మాటలే మంటలైనంక
కోటలు కూలాల్సిందే
అధికార అహంకారం
అడుగుబట్టాల్సిందే.

(ఒకానొక ప్రజాప్రతినిధి నగరంల "నీళ్ళు రాకుంటె మంటలొస్తయా? అనే అహంపూరిత వ్యంగ్య భాషణకు స్పందించి)



- నల్లెల్ల రాజయ్య
9989415571

# మణిపూసల మణిహారం

'మణిపూసలు' అనే నూతన కవితా ప్రక్రియకు శ్రీకారం చుట్టిన కవి వడిచర్ల సత్యం. అంత్యానుప్రాసలు, లఘురూపం, గేయశైలి వంటి లక్షణాలు కల ఈ కవితాప్రక్రియ చాలా మంది రసభావుకులను ఆకర్షించి, తమ కలాలను కదిలించేలా చేశాయి. అప్రయత్నంగా 'వడిచర్ల' నుండి సృజించబడిన ఈ ప్రక్రియ వందల మంది ఔత్సాహికులను ఆకర్షించింది. వారిచే వేల మణిపూసలను రచింపజేసింది. ఇందుకు 'సత్యం' అభినందనీయుడు.

ఎంతో మంది విరివిగా రాయడం మొదలుపెట్టినా ఈ ప్రక్రియలో తొలి కవితాసంపుటి 'వడిచర్ల'దే. ఎక్కడో విదేశంలో ఉన్న నాకు ఆ పుస్తక ప్రతిని చదివే అవకాశం కలగలేదు. కాకపోతే ఆ సంపుటి ఆవిష్కరణ సందర్భంగా తేది 20.12.2018నాటి నేటినిజం పత్రికలో ఒకే సారి ప్రచురించబడిన శతాధిక మణిపూసలను ఆన్లైన్లో చదవగలిగాను. 'సత్యం'తో వ్యక్తిగతంగా గాని 'సత్యం' కవిత్వంతో గాని ఎటువంటి పరిచయం లేని నాకు వీటిని చదివినప్పుడు నాలో కలిగిన స్పందనకు అక్షరరూపమే ఈ చిన్ని వ్యాసం.

శ్రీపద మణిపూసలు/సాహిత్యపురాశులు/వడిచర్ల సృష్టించిన/నవకవితల మెరుపులు! అంటూ ప్రాచీన కవుల తరహాలో తన కవితా సంపుటికి శ్రీకారం చుడుతూ అది కవితామెరుపులతో రాశులుగా వర్ధిల్లాలని కోరుకుంటున్నాడు కవి. కామన ఒక్కటే కాదు మొత్తం కవితా నిర్మాణం కూడా పూర్వకవుల శైలిలోనే సాగింది.

లలితకళలు మనిషికి వికాసాన్ని కలిగిస్తాయి. ఆ కళలు, వాటిని సృజించే కళాకారుల గొప్పదనాన్ని ఇలా వర్ణిస్తున్నాడు కవి కవుల కలం గొప్పది/శిల్పుల ఉలి గొప్పది/సృష్టిని నడిపిస్తున్న/శక్తి యింక గొప్పది!. వారి గొప్పదనాన్ని స్తుతిస్తూనే వీటన్నిటికి మూలాధారమైన సృష్టిని, ఆ సృష్టిని నడిపిస్తున్న శక్తి ఇంకా గొప్పదనే భావనను, సత్యాన్ని ఈ చిన్ని మణిపూసలో అందంగా గుదిగుచ్చాడు. అయితే అన్ని లలితకళలను, వాటికి ప్రకృతితో కల బంధాన్ని స్పృశిస్తూ రాసుంటే పాఠకుడిలో ఇంకొంచెం రసానందాన్ని కలిగించేవాడేమో అనిపించింది. జ్ఞాననిధి అంటూ, అజ్ఞానతిమిరాన్ని పారద్రోలే కాంతినది అని పుస్తకానికి కవితాకైమోడ్పులర్పిస్తున్నాడు జ్ఞాననిధి పుస్తకము/బుధలమది పుస్తకము/విశ్వమంత ప్రవహించెడి/కాంతినది పుస్తకము!. వేరు వేరు మణిపూసల్లో తరువులను చెరువులను ఎన్నోసార్లు తలుచుకుంటూ, వేలచెట్లు పెంచుదాం ప్రతిదినం అంటూ పర్యావరణ స్పృహను మెండుగా చాటుకున్నాడు కవి.

నేటి మనిషి ఎందుకిలా ఉన్నాడో ప్రశ్నిస్తున్నట్టే ప్రశ్నించి, అతను అలవర్చుకోవలిసిన జీవన సంవిధానాన్ని చిన్ని చిన్న పదాల్లో 'మణిపూసలు'గా ఎలా చెప్పాడో చూడండి.

ఒప్పు జరిగితే నాది/తప్పు జరిగితే నీది/ఇట్లాంటి మాటలే/కొట్లాటలకు పునాది!

మత్తు పెరుగుతున్నది/మమత తరుగుతున్నది/నైతిక విలువల వెలుగు/మసకబారుతున్నది!

అంతరంగమందున/ఉన్న చిన్న సందున/అణువంత నీతివుంటె/ఇన్ని గొడవలుండున?

బాల్యం తాలూకు పవిత్రతను, పరిమళాన్ని ఎంత స్వచ్ఛంగా చెప్పాడో ఈ కింది కవితలో చూడండి చిన్నచిన్న పిల్లలు/తెల్లనైన మల్లెలు/ప్రకృతిని మురిపించెడి/తొలకరి చిరుజల్లులు.

ఈ మణిపూసలన్నిటిని సునిశితంగా పరిశీలిస్తే ఈ కవి బాలసాహిత్యకారుడేమో అనిపిస్తుంది. ఆ ప్రభావం చేతనే ఈ కవితలన్ని పిల్లలకు నచ్చే ఫణితిలో, వారికి అర్థమయ్యే రీతిలో సుభోదకంగా చెప్పినట్లు అనిపిస్తుంది. అందుకే ఒకే పదం పునరుక్తి అవుతూ వస్తోంది చాలా కవితల్లో. భావుకత, విషయ పరిజ్ఞానం, శబ్దశక్తి ఉన్న కవి అని తెలుస్తున్నా ఈ పునరుక్తి లేకుంటే లఘురూపమైన ఈ కవితలో కవితాత్మకత ఇంకా ఎక్కువగా ఉండడానికి అవకాశం ఉంటుంది. ఈ అంశాన్ని పరిశీలించి, సరిచేసుకుని కవి తన సహజసిద్ధ ప్రతిభతో రాస్తూపోతే అద్భుతమైన మణిపూసలను సృజించగలడు. ఇది నా వ్యక్తిగత అభిప్రాయమే.

సత్యం కలం నుండి అద్భుతమైన సాహిత్యం వెలువడాలని మనసారా కోరుకుంటూ...
అభినందనలతో



-రాపోలు సీతారామరాజు
0027-727747549

## చిలువేరు చురకలు

సాగు బిల్లు
కల్లానికి చిల్లు
పీఠం మీదున్నది
వాటమైన
వ్యాపార కళ.!

మడికట్టు
మార్కెట్ తాకట్టు
రైతు మెడకు
రాజ్యం ఉరి.!

వెన్ను ముక
ఎవుసం
పార్లమెంట్
సాక్షిగా ధ్వంసం.!
రాజ హంస...
మారు బేర మంత్రం.!

పంటల మీద
కార్పోరేట్
కంటి తీగల కన్ను
వీర వనిత ఐలమ్మ
దారే వెన్ను దన్ను.!

మిత్తి మీద మిత్తి
మెడమీద అప్పులకత్తి
నాగలి కొడవలి
ఎర్ర బారితేనే...
రైతు రాజ్యం..!

-చిలువేరు అశోక్

## భవిష్యత్ శ్మశానమే!

మానవ మనుగడకు పచ్చని దీపాలు పంటపొలాలు
రయ్యిమని పరుగెడుతున్న నగరానికి నిషాణీ మెట్రోరైళ్ళు
ఆత్మీయ పలకరింపులు గ్రామాల స్వచ్ఛతకు ప్రతిరూపాలు
రణగొణ ధ్వనులు నగరాల కాలుష్య కారకాలు
ఇరుకైన మార్గాలు విశాలమైన మనస్సులకు దర్పనమిస్తాయి
విశాలమైన రహదారులు
మనుషుల మధ్య దూరాన్ని ప్రతిబింబిస్తాయి
చెరువుగట్లు మమతానురాగాల ఊటలు
పై వంతెనలు నాగరికతకు పై పై మెరుగులు
రికాం లేని రద్దీ కూడళ్లు కొవిడ్-19 వాహకాలు
రచ్చబండ ముచ్చట్లు అవగాహనా మంత్రాలు
చినుకు తాకిడికి విప్పారే మట్టి వాసన
ఐదు నక్షత్రాల హోటళ్ల ఘుమఘుమలకు బలాదూర్
విత్తనాన్ని వటావృక్షాన్ని చేసే మహాక్రతువు ఒక వైపు
తాను కూర్చున్న కొమ్మను
తానే నరుక్కునే వెర్రివేషం మరో వైపు
మట్టిని పిసికి అన్నం ముద్దగా మలిచే
అన్నదాత కళ్ళు చూసేది కారుమబ్బులనే..
ఖరీదైన కార్లను కాదు
తమ కష్టాలన్నీ తూర్పార బడుతూ..
ఆకాశహర్మ్యాలలో దొరకని ఆనందాన్ని
ధాన్యపు రాశుల్లో చూసుకుంటారు
మెట్రో నగరమైనా.. మారుమూల గ్రామమైనా
కర్షకుని కాయాకష్టం లేనిదే భవిష్యత్ శ్మశానమే!



-గుండు కరుణాకర్
9866899046

## అక్షరజ్యోతి...!

అక్షరంబువలన:నజ్ఞానభావంబు
నంతరించి పోవు:హాయిగాను
జ్ఞానవెలుగుతోడ:జాతికీర్తిబెరుఁగు
అక్షరంబు జ్ఞాన:మమరదీప్తి..!

అక్షరములుగూడి:నత్యద్భుతకవితల్
కవులువ్రాసినట్టి:కావ్యవితతి
భావికవులకిలను:భాగ్యపదపథము
అక్షరాస్యతప్రజకు:అరయతెలివి..!

చదువురానియెడల:చాలమోసంబురా
తెలివివున్న వాడు:తెంపుతోడ
తీరుబడిగమిమ్ము:తిప్పలుపెట్టును
అలసిసొలసిమీరు:అరయువిద్య..!

వర్ణమాలవల్ల:వద్దికతో తెన్గు
తీపిహెచ్చె పఠిత:తేట మదిన
తెలుగుభాష యన్న:తేనెలూరుమదికి
నవ్య కావ్య పఠన:నాంది పలుకు..!

ఇతరభాషలనిల:యింపుగగల్సియు
వెలుగులీనుభాష:తెనుగుభాష
అక్షరాలురాని:నర్భకులకుసేవ
నిరతితోడ మనము:నేర్పవలయు...!

అక్షరాస్యతనిల:నందరికందించి
భవిత మేలుగోరి:బాగుపరచి
తెలివిపెంపుజేయ:దెలియువివేచన
భావిభారతంబు:బాగుపడును..!

అక్షరంబులేను:నాదిగాపదములై
వాక్యరూపమొంది:వాక్కుగాను
కవులకవనరూప:కావ్యాలుగామారి
వెలుగుజూపుమనకు:విశ్వమందు.. !!



-డా.గన్నోజు శ్రీనివాసాచారి
8555899494

## ఆన్లైన్ చదువులు

పాఠశాల నేడు శానిటైజర్
పూసుకుంది. తరగతి గదులు
మాస్కు లేసుకున్నాయి.
అర్థం కాని పాఠాలు అదుపు తప్పి పోతున్నాయి.

అంతర్జాలంతో...
గంటలు లేని బడిలో కూర్చుని
చెవులకు మూతలు వేసుకుని
కాలం మార్పులో కరిగిపోయిన చదువులు
గడప దాటని గానుగెద్దు చదువులు..
ఆన్లైన్ విద్య అంతా మిద్య.

నెట్టింట్లో బంధించి
ఉన్న వారికి ఊపిరి పోసేది
లేనివానికి ఊపిరి తీసేది
అవుతున్న ఆన్లైన్ విద్య.

గురుశిష్య సంబంధం
భూమి ఆకాశమయ్యింది.
గురువు లేని విద్య
గ్రుడ్డి విద్య గా మిగులకూడదని ఆశిద్దాం..
కరోనా తెచ్చిన తెరపై చదువులు



-కె.రాధిక నరేన్
9441634645

## వితండవాదం

ఉలి దెబ్బలుకి శిల్పం రూపాన్ని దాల్చుతుంది..
కాలం కొట్టే కొరడా దెబ్బలకు
మనసులో జనించే భావాలకు
ఆలోచనలు మారుతాయి..
విగ్రహారాధన తప్పనుకుంటే
దైవాన్ని పూజించే హృదయం
దారం తెగిన గాలిపటమై
వికృత రూపాలని ఎగరవేయదా..
నీకేదో కష్టమొచ్చిందని
కనులు మూసుకుని
ప్రపంచ చిత్రం ఏక వర్ణంతో
ఆవేశంగా గీయడానికి నీ వెవరు?
నోటికి అధికారమిస్తే
చేతలు పెట్రేగిపోతాయి...
సృష్టి నీది కాదు.,
ఆ పైవాడు ఏదో చేస్తాడన్న
భయంతోనే అడుగులు వేస్తున్నా.. రోజుల్లో కూడా..
అమానుషాలు అడుగడుగునా
దర్జాగా విరుచుకుపడుతుంటే,...
రాతలు మార్చే...ఆ భగవద్గీ"గీ"తేలేదంటే...
ఈ సమాజంలో మనుషులు తిరుగాడుతారా చెప్పండి?
గర్భ గుడిని దాటి ఆడపిల్ల ..అమ్మ పొత్తిళ్ళను చేరగలదా?
దైవాన్ని నిందిస్తే చిక్కుముడులు విడవు..
వితండ వాదానికి ప్రాణం పోసి
కనురెప్ప కూడా నా ఆధీనంలోనే అనే
భ్రమకి మంగళం పాడి..
మానవత్వపరిమాళాలను వెదజల్లే
దైవత్వగుణానికి ఆలంబనగా నిలవండి..
ధూషణం మనిషికి భూషణం కాదు..
దహనశీలైన కోపాన్ని రాజేస్తే...
దహనమైయ్యాది..సృష్టి చిరునామా అని గ్రహించండి,,



-శ్రీదేవి సురేష్ కుసుమంచి
7032760484

## ఓ సోదరా..

ఓ సోదరా!
లోకంలో అందరు నా మాటనే వినాలి
నా పాటనే పాడాలి..
నా బాటనే నడవాలి
అనుకుని
అహంకారంతో అందరిపై ఆధిపత్యం వహించాలని
పగలూ.. రాత్రి... పలుకుతావెందుకు
కాలం నిన్ను అడిగే కదలారా..
పారే నదులు నిన్ను అడిగే పారాలా
వీచే గాలి నిన్ను అడిగే వీయాలా..
నిన్ను ఇంతగా పొగరుబోతును తయారు చేసింది
నీలోని అహంకారాన్ని నింపింది
నీ పీఠం బలం, నీ నోటుల బలం
నీ కండ బలం, నీ మందబలం
ప్రజలు ఓట్లు వేయకపోతే..
నీ పీఠం ఊడిపోతుంది
దొంగలు, దొరలు దోచుకుంటే
నీ నోట్ల బలం తగ్గుతుంది
కరోనా రోగం అంటుకుంటేనా..
నీ కండ బలం తగ్గుతుంది
మందు, మాకు పోయించకపోతే
నీ మందబలం తగ్గుతుంది
ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు
మందబలం చూచి నీవు
కుక్క మొరిగినట్లు మొరగవద్దు
కలకాలం నేలపై నిలిచేది
మన మంచి, చెడే
మంచి పనులు చేయి
మంచి పేరుతో బతుకు..



-సిరిగాద శంకర్
సెల్: 9493301985

## చేనేతల వెతలు

సత్తువనంతా పోగులుగా వడికి
వడివడిగా వస్త్రాలనే నేస్తారు!
రుధిరాన్నే చెమటపూలను జేసి
వర్ణాల సౌరభాలు అద్దుతారు!

పనితనాన్ని పత్తికి అద్ది
పేదరికపు పొట్లనే దారపు ఉండలు జేసి
అగ్గిపెట్టెలో అమరే జరీకోకలకు
పురుడుపోస్తారు!
బతుకు మగ్గంపై
ఆకలి దూదితో అలుపెరుగక పోగులను
అందంగా అల్లుతారు!

విరామమెరుగని శ్రమలో
ఖాళీ కడుపుతోనే సేదదీరుతారు!
అందరికీ
సుందర వర్ణ చీరలు కానుకిస్తారు
కానీ..
వారి బతుకులో మెతుకులకు నోచుకోరు!

పవర్లూములు వచ్చి
వారి జీవనోపాధిని గద్దలా తన్నుకుపోతుంటే
ఊపిరినే వదులుతున్నారు!
ఉస్సూరుమని విలపిస్తున్నారు!!

ప్రభుత్వమే చేయూతనిచ్చి
చేనేత పరిశ్రమలను వృద్ధి చేయాలి!
నేతన్నల కన్నీటి వెతలను కడతేర్చాలి!!

మనమంతా స్వదేశీ వస్త్రాలనే ధరిస్తూ
చేతివృత్తులకు జీవం పోద్దాం!
బతుకు దెరువుకు బాసటగా నిలుద్దాం!



-అయిత అనిత
8985348424

## అందరి హక్కు

బతకాలని ఉండనిది ఎవ్వరికి
చీమ మొదలు ఏనుగు వరకు..
బ్రతికే హక్కు అందరిదీ పుడమిన

పర్యావరణ కాలుష్యము చేయకుండా
బ్రతుకుతున్నాయి ప్రతి జీవి భూమిపై
మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నది మనిషే
చిగురులు వేసే చెట్లన్నీ గాలికి ఊగుతూ..
సంతోషంతో గెంతులు వేస్తున్న ప్రాణులు
నాదే ప్రకృతి అంతా అనే
ఆనంద పడుతున్నాయి ఆహ్లాదంగా !

కడుపులో పెరిగే చిన్ని శిశువు ..
ఎప్పుడెప్పుడు ప్రపంచాన్ని చూస్తానా అని
ఎదురు చూస్తున్న వేళ...
ఊపిరి నొక్కేసి నుదుటి రాతను
మారుస్తున్న మహనీయులము మనమే

ఎదిగే మొక్కలను ఎదగకుండా చేసి..
బోన్సాయ్ అంటూ మరుగుజ్జు లను చేస్తూ
పైశాచిక ఆనందం పొందేది మనమే కదా!

మనిషి మాత్రమే ప్రమాద కారి
స్వార్థం నిలువెల్లా పేరుకుని..
శాస్త్రీయత అంటూ సహజాన్ని అసహజం చేసి
పొందుతున్నాడు వెర్రి సంతోషాన్ని!

సాంకేతిక పరిజ్ఞానం పెంచుకుని
వ్యవసాయ భూములను కలుషితం చేసి
పరివాహక ప్రాంత వాసుల ప్రాణాలని
హరించి వేస్తున్నారు...

లేదా వారికి జీవించే హక్కు..
ధనంతో హక్కులు కొనుక్కుంటున్నారా
పుట్టుకతో వచ్చే ఆస్తి ఈ ప్రకృతి..
బ్రతక నివ్వండి అందరినీ!



-లక్ష్మి మదన్
9959186838

## ఉండలేనితనం లోంచి

పొద్దు రాలిన సంజెవేళ చీకటి చిగురున
గుండెలో రాగాలను అలా మోసుకుపోతుంటాను .

ఆ ఇసుక తిన్నెలు బొమ్మలు పూసి
అలలు చేతులిచ్చి ఎగసే వేళ
ఊహలకి రెక్కలొచ్చి ఎగురుతుంటాయి .

ఎర్రెర్రని సూర్యాస్తమయాలు
కొండల మధ్య మునుగుతుంటాయి .

విచ్చుకున్న హృదయాన్ని
ఆకాశానికి అతికి చూస్తే
ధగ ధగా మెరిసే కలలు మోగుతుంటాయి .

రాక్షస మీమాంసా తొడుగుల్లో
ఛిద్ర ప్రపంచంలో
విచ్ఛిన్న వైఖరులు ప్రకృతిని మింగుతుంటాయి .

పీల్చే గాలికి స్వేచ్ఛ లేదు
నడిచే నడకకి ధైర్యం కుదరదు .

వర్ష మొచ్చి వాగులొచ్చి
బతుకులు చెరువులయినాయి

ఎండలు పేలి
తనువులు చెమట బావిలో
బావురుమన్నాయి.

ఒక వైపు క్రిములు యుద్ధం చేస్తున్నాయి .

తీరం వీచే గాలికి సేదతీరాలో
పొద్దు పోయే జీవితాలకి
కన్నీటి గీతిక పాడాలో
సంద్రం ఒడ్డున ఆలోచనలు
ఉండలేనితనంలోంచి
ఉలిక్కి పడుతున్నాయి .

-గవిడి శ్రీనివాస్
7019278368

## అవకాశవాది

ఏ ఎండకా గొడుగు పట్టువాడు అవకాశవాది
నడమంత్రపు సిరి గోరువాడు అవకాశవాది
పేదల పెన్నిధినంటూ వారినే జలగలా
పీల్చి పిప్పి చేసేవాడు అవకాశవాది

'నా నోట్లో ఏలెట్టు- నీ కంట్లో నే ఏలెడ్తా' సూక్తిని
పాటించువాడు అవకాశాది
'మీ ఇంటికొస్తే మాకేమిస్తావ్-మా ఇంటికొస్తే
మాకేం తెస్తావో అనువాడు అవకాశవాది.

తరచుగా పార్టీలు ఫిరాంచువాడు అవకాశవాది
దరిద్రనారాయణ-యువకుడు ధనాశతో
ఇల్లరికపు అల్లుడైనవాడు అవకాశవాది
భారతీయ సాంకేతిక పట్టభద్రుడు ఉద్యోగార్థం
వలసమేధావిగా
మారిపోయినప్పుడు అవకాశవాది.
ఒకరికి చెందవలసిన ఉద్యోగాన్ని జిత్తులువేసి
చేజిక్కించుకొనువాడు అవకాశవాది
'జగత్తంతా మిథ్య' అంటూ తిరిగే అయోగ్యుడూ
ఘనపదవి చేజిక్కించుకున్నప్పుడు అవకాశవాది.
స్వార్థం కోసం అవకాశాన్ని వినియోగించువారు
అన్యులకు హాని కలిగించనంత వరకూ శ్రేయస్కరమే.
పరులకు లభించే అవకాశాలను అడ్డుకొనేవారు
సర్వదా నిందనీయులే.



- అమర్జీ
సెల్: 9620186222

## నాని

ఎంత మంది వున్నా
ఎవ్వరూ తోడురారు
నీటి చుక్క మేలు
కలిసి నదిగా మారు.



- యం. నారాయణరెడ్డి
సెల్: 9989686603

## నానీలు

కోరిన వన్నీ ఇచ్చే
కన్న ప్రేమ
కోరుకున్న వాడిని
కడతేర్చుతుంది

కులమత పిచ్చి
చిచ్చు రేపుతుంది
తండ్రీ కూతుళ్ళ
అనుబంధాల మధ్య

కర్కశత్వం
విషం చిమ్ముతుంది
ఆడబిడ్డల
అయిదోతనాన్ని చిదిమేస్తూ

శతమానం భవతి
అనే తల్లి దండ్రులు
అప్పగిస్తున్నారు
సుఫారీలకు

పసుపు కుంకుమల
పుట్టింటి సారె
పరువు హత్యలతో
రక్త సిక్త మైంది



-కళావతి కందగట్ల
9948263004

## నాన్న ఇప్పుడు ఎట్లున్నడో...?

నేను కనపడక పోయిన
ప్రతి సారీ
ఊరంతా గడియారం ముల్లులా
తిరిగిన నాన్న నన్ను మరచి
ఇప్పుడు ఎట్లున్నడో ?

ఇల్లును ఇష్టంగా మలచి
మా బాల్యం రెక్కల్ని అందులో దాచి
నిత్యం వాకిటిని అంటి పెట్టుకొని ఉండే నాన్న
ఇళ్లని,తనని తాను మరచి ఇప్పుడు ఎట్లున్నడో ?

కాడెద్దుల్ని జత జేసుకొని
మడకతో మాగాణిని పలకరించి,
పంటల్ని చిలకరించి మా సెలకలో
చిరుదీపం అయిన నాన్న
ఇప్పుడు చేనును చూస్తూ
కాడిని మరచి నాన్న
చీకటిలో ఇప్పుడు ఎట్లున్నడో ?

ఎన్నో ప్రేమలు, మమతలు పంచి
ఊరు మనుషుల మనసులను గెలిచిన
నాన్న అందరినీ విడిచి
ఇప్పుడు ఒక్కడే ఎట్లున్నడో ?

మేఘాల్ని చూస్తూ,మురుస్తూ
వాన చినుకుల్లో తానూ ఓ పడవై
రేపటి కలల్ని మా ఇంటి తీరం వైపు
నడిపించి ఆఘమేఘాల్లోకి
ఆత్రంగా వెళ్లి, మా మీద బెంగతో
నాన్న ఇప్పుడు ఎట్లున్నడో...?



-మహబూబ్
బాషా చిల్లెం
9502000415

## నానీలు

పొగడ జల్లులు
వకుళ వాసు
హన్మకొండ
అంశం- కలం

కలం తూటాలను
వర్షిస్తుంది
తొక్కాలని చూసే
పెత్తందార్లపైన

ఎదకు మదికి
కొట్లాట పెట్టి
పిడుగులను
రాలుస్తుంది కలం

మస్తిష్కపు తండ్లాటను
వేళ్ళ మధ్య ఒంపి
పురుడు పోసే
ఆయుధం కలం

మదిలో భావాలు
మంచు ముత్యాలై
కలం కొమ్మలనుండి
రాలుతున్నాయి

కవన రణాన
కలమే కత్తి
అక్షరాల రుధిర
వాహినులకై

భావ పరిమళాలు
వ్యాపించాయి
అక్షర మల్లెలై
కలంలో కురిసి

అనుభవాలను
సిరాలో ఒలికించి
కలం కదులుతోంది
కాలం తోడుగా



-వకుళ వాసు, 9989198334

## అందినవి




పుస్తకం: ఆనంద నిలయుండు
రచయిత: డా॥ మాదిరాజు బ్రహ్మానందరావు
ప్రతులకు:ఆందవాని నిలయం, 6-59/29
దోమల్గూడ,నాగారాం (పో)క్రిష్ణ సినిమా హాల్
కీసర మండలం, మెడ్చల్ జిల్లా
హైదరాబాద్-500 083




పుస్తకం: జీవన సారణి
రచయిత: డా॥ మాదిరాజు బ్రహ్మానందరావు
ప్రతులకు:ఆందవాని నిలయం, 6-59/29
దోమల్గూడ,నాగారాం (పో)క్రిష్ణ సినిమా హాల్
కీసర మండలం, మెడ్చల్ జిల్లా
హైదరాబాద్-500 083




పుస్తకం: ధీ వరేణ్య శతకం
రచయిత:డా॥ నలవోలు నరసింహారెడ్డి
ప్రతులకు:ఎన్. విక్రమఖ రెడ్డి
ఇ.నెం. 9-9-144, ప్లాట్ నెం. 39
రెడ్డికాలని-చంపాపేట్, మం॥ సరూర్నగర్
జి॥ రంగారెడ్డి. హైద్రాబాద్-500 059




పుస్తకం: లింబాద్రి శతకము
రచయిత: ఎలగందుల లింబాద్రి
ప్రతులకు:నిజామాబాద్
సెల్: 7659834393




పుస్తకం: కాశీమజిలీ కథలు
రచయిత: డా॥మాదిరాజ బ్రహ్మానందరావు
ప్రతులకు: వరంగల్ బుక్ సెంటరు
ఎస్విఎస్ఎ. కాలేజ్ షాపింగ్ కాంప్రెక్స్
స్టేషన్ రోడ్, వరంగల్.




పుస్తకం: పక్కింటి కోడలు
రచయిత: తొగర్ల సురేష్
ప్రతులకు: కోటగల్లి,
నిజామాబాద్
సెల్: 9948579588




పుస్తకం: మౌనగీతం
రచయిత: జి. శాంతారెడ్డి
ప్రతులకు:ఇ.నెం, 8-5-1/3/డి
శాంతినికేతన్, టీచర్స్ కాలనీ,
మహబూబ్నగర్. సెల్: 8008177324




పుస్తకం: తెలుగు వెలుగు శతకం
రచయిత: పెరుముల కైలాస్
ప్రతులకు: ఇ.నెం. 14-76
ఓల్డ్ యస్.సి. కాలనీ,గ్రా॥ &మం॥ భిక్కనూర్,
జి:: నిజామాబాద్.

